# అక్షర రేఖ

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Adilabad

RNI NO. TELTEL /2012/44706

గురువారం, 10.04.2025 | Akshara Rekha Telugu Daily | వెల : రూ.2/- | సంపుటి : 13 | సంపుటి : 281 | పేజీలు : 8

"కులగణన ద్వారా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దేశమంతా కులగణన జరగాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అన్నారు. ఆయా వర్గాలకు వారి హక్కులు లభించాలంటే ఎవరు ఎంతమంది ఉన్నారన్న లెక్క తేలాల్సి ఉందన్నారు. ఏం సంస్థలలో దళితులు, ఆదివాసీలు, ఇతర వెనకబడిన వర్గాలకు వారి వాటా దక్కడం లేదన్నారు. ఆదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగుల జాబితా తీస్తే కూడా ఇది తెలుస్తుందన్నారు. ఇకపోతే రాజ్యాంగమే కాంగ్రెస్ ఆత్మ అని, దానిని పరిరక్షించుకునేందుకు మనమంతా కలసి పోరాడాలని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత స్వేచ్ఛ మీద దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన 84వ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు.

# కులగణన తేలితేనే ఆయావర్గాలకు న్యాయం

- దేశానికి ఆదర్శంగా తెలంగాణ కులగణన
- కులగణన తేలితేనే ఆయావర్గాలకు న్యాయం
- వారి వాటా వారికి దక్కడంలో అవకాశం
- అలాంటి ప్రయత్నాలను అడ్డుకుంటున్న బిజెపి
- రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సదస్సులో రాహుల్

**అహ్మదాబాద్, ఏప్రిల్ 9 :** మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగం, మన ఐడియాలజీ అని, దానిని మనమే కాపాడుకోవాలన్నారు. కాంగ్రెస్ ఐడియాలజీ రాజ్యాంగమని.. అందుకే బీజేపీ ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు మన రాజ్యాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఇది తన బాధ్యత అన్నారు. బీజేపీ తమ వ్యవస్థ మీద దాడి చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణాలో కులగణ అంశంపై స్పందించారు. కులగణనపై మంచి స్పంద న వచ్చిందన్నారు. మైనార్టీలు, ఆదివాసులు, గిరిజ నుల కోసం కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. జాతీయ జనగణన చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. తెలం గాణలో కుల గణనపై రేవంత్ రెడ్డి నాకు వివరించారు. తెలంగాణలో ఓసీలు, బీసీలు మైనార్టీలు ఎంత అనేది తేలింది. తెలంగాణ లో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నాం. దేశానికే ఆదర్శంగా నిలిచాం. రాష్ట్రంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసులకు సరైన ప్రాతినిధ్యం లేదని స్పష్టమైంది. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిల్లు కేంద్రానికి పంపారు. రేవంత్‌రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

మిగతా 2 లో

## మోడీతో దేశానికి తీవ్ర నష్టం

- ఆయనను తప్పిస్తేనే దేశానికి మోక్షం
- రాహుల్ ఆదేశాలతో కులగణన చేపట్టాం
- తెలంగాణ విముక్తికి పటేల్ కారణం
- తెలంగాణ ఇచ్చిన సోనియా ధన్యురాలు
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో రేవంత్ వ్యాఖ్యలు

02

## భారతదేశంలో జైనానిది విడదీయలేని బంధం

- ఉగ్రవాదం లాంటి సవాళ్లకు జైనమత విలువలే సమాధానం
- మహావీర్ జయంత్యుత్సవంలో ప్రధాని మోడీ

03

## జూన్ 30 వరకు ధాన్యం కొనుగోళ్లు

- పౌరసరఫరాల సంస్థ నిర్ణయం
- ఇప్పటి వరకు 1,838 కేంద్రాల్లో 95,131 టన్నుల కొనుగోలు

02

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** యాసంగి సీజన్ వడ్లను రైతుల నుంచి జూన్ నెలాఖరు వరకు కొనుగోలు చేయాలని పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 8,209 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళి కలు సిద్ధం చేసింది. ధాన్యం దిగుబడుల అంచనాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల సంఖ్యను ఖరారు చేసింది. పంట కోతలను బట్టి ఆయా ప్రాంతాల్లో కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు పౌర సరఫరాల సంస్థ వర్గాలు తెలిపాయి.

మిగతా 2 లో

## గ్రూప్-1 మెరిట్ జాబితా వెల్లడి

- 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- నాంపల్లిలో ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో ప్రక్రియ

02

## బిసి గురుకుల విద్యార్థులకు సెయిలింగ్ శిక్షణ

సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు వెల్లడి

02

## కోలుకుంటున్న మార్క్ శంకర్

- మరో మూడు రోజులు ఆస్పత్రిలోనే చికిత్స
- కొడుకు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో పవన్ సంప్రదింపులు
- మార్క్ ఫోటోను విడుదల చేసిన కుటుంబ సభ్యులు

03

## రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారు

- కాంగ్రెస్ అంతరించిపోతున్న పార్టీ
- భారాస పాలన కంటే రెట్టింపు స్థాయిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత
- కేంద్ర మంత్రి బండి సంజయ్

02

## 'క్యుములోనింబస్' ప్రభావం..

తెలంగాణలో రెండు రోజులు వర్షాలు

విభాగం ప్రకటన

## రష్యా విక్టరీ డే పరేడ్

ప్రధాని నరేంద్రమోదీకి ఆహ్వానం

10

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అటకెక్కించారు

- ఒక్క హామీ అమలు చేయలేక చతికిలపడ్డారు
- కేసీఆర్‌ది సాగుభాష.. రేవంత్‌ది చావు భాష
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

కేసీఆర్‌ది సాగు భాష అయితే.. రేవంత్ రెడ్డిది చావు భాష అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవన్నది ప్రజలకు అర్థమయి పోయిందన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు.

03

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ కులగణన

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో కులగణనను విజయవంతంగా నిర్వహించారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అంశాన్ని తొలగిస్తాం. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారు. తెలంగాణ సంపదలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన భాగస్వామ్యం లేదు. వారి జనాభాకు అనుగుణంగా సంపదలోనూ తగిన వాటా అవసరం' అని రాహుల్ గాంధీ అన్నారు. దేశ జనాభాలోని 90 శాతం మంది జనాభాకు సరైన ప్రాతినిధ్యం లేదు. 90 శాతం మంది జనాభా అవకాశాలను లాగేసుకున్నారు. మీరందరూ లేకుండానే భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీ చేయగలడా? అని ప్రశ్నించారు. మహాత్మ గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, అంబేద్కర్, గురునానక్, కబీర్ ఆలోచనల రూపం భారత రాజ్యాంగం అని రాహుల్ గాంధీ అన్నారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల నాటి పుస్తకంగా భావించరాదని.. వేలాది సంవత్సరాలుగా భారత దేశ ప్రజల ఆలోచన విధానమే భారత రాజ్యాంగం అని స్పష్టం చేశారు. రాజస్థాన్ లో సీఎల్పీ నేత దళితుడని.. గుడిలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారన్నారు. ఆయన గుడికి వెళ్లిన పాపానికి గుడిని శుభ్రం చేశారని అన్నారు. ఇది బిజెపి ఆలోచనా విధానామని, కానీ తమ కార్యకర్తలు దళితులు, ఆదివాసులు అందరికీ గౌరవం ఇస్తారని చెప్పారు. దేశ సమస్యలు తీర్చాలంటే.. దేశాన్ని ఎక్స్‌రే తీయాలని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. దళితులు, ఆదివాసీల సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలకు న్యాయం జరుగుతోందా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. వారి సమస్యలను పరిష్కరించేం దుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ విమర్శించారు. చనిపోయాక నా గురించి ప్రజలు ఏం ఆలోచిస్తారనేది అనవసరం. నేను అనుకున్న పనులు పూర్తి చేశాక ప్రజలు మరిచిపోయినా నాకు అభ్యంతరం లేదు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారు. ఇద్దరు వ్యాపారవేత్తలకే వాటిని అప్పగిస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, గనులు, సిమెంట్, స్టీల్ సహా కీలక పరిశ్రమలన్నీ ఓ పారిశ్రామికవేత్తకే కట్టబెడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా అక్రమాల ద్వారా గెలిచింది. అక్కడ ఓటరు జాబితా కోరితే ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఆర్ఎస్ఎస్, భాజపా రోజూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. దేశంలో కులగణన చేపట్టాలని ప్రధాని మోదీని కోరాం. దీనికి ప్రధాని సహా ఆర్ఎస్ఎస్ తిరస్కరించింది. లౌకిక భావనకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఇకపోతే మోడీకి అత్యంత సన్నిహితుడైన ట్రంప్ టారిఫ్‌లతో ఆర్థిక ఉత్పాతం దూసుకు వస్తోందని హెచ్చరించారు. బంగ్లా తాత్కాలిక సారథితో సమావేశంలోనూ మోడీ నోరు మెదపలేదని అన్నారు. ఎప్పుడూ తనగురించి గొప్ప చెప్పుకునే మోడీ తన దారేందో చెప్పరని, కానీ ఇందిరా ఓ సమయంలో తనది భారత్ దారని గర్వంగా చెప్పారని గుర్తు చేశారు. ఈ వేదికపై సోనియా, అంబికా సోనీ, ఖర్గే, కెసి వేణుగోపాలు, సిఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

## బిసి గురుకుల విద్యార్థులకు సెయిలింగ్ శిక్షణ

### సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** విద్యార్థుల్లో చదువుతో పాటు వారి ఆసక్తిని గమనించి అనుగుణంగా అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులో భాగంగా బిసీ గురుకుల విద్యార్థులకు సెయిలింగ్ క్రీడ ద్వారా శాస్త్రీయ శిక్షణతో పాటు నీటిలో నైపుణ్యం, సహనం, చురుకుదనం వంటి లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో యాచ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బేసిక్ ఫౌండేషన్ కోర్సుకు అర్హత సాధిస్తారు. బేసిక్ కోర్సులో అర్హత పొందిన వారికి మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు- వారు జాతీయ, అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో పాల్గొన్నే నైపుణ్యం వస్తుంది. 2026 లో జరిగే ఆసియన్ గేమ్స్ , 2028 జరిగే ఒలింపిక్స్ లో పాల్గొనే అవకాశం ఉంటుందని మహాత్మా జ్యోతిబా పూలే బిసీ గురుకుల విద్యాసంస్థల సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బిసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న 14 ఏండ్ల లోపు వయసు గల విద్యార్థులలో ఆసక్తి గలవారిని ఈ శిక్షణకు ఎంపిక చేశామని, బాలురు 32, బాలికలు 19మంది శిక్షణకు హాజరు అవుతున్నారని ఆయన తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 11 తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, బేసిక్ శిక్షణ పూర్తి చేసిన వారిలో బెస్ట్ అనిపించిన వారికి నెక్స్ట్ లెవల్ ట్రైనింగ్ ఉంటుదని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని ఆయన వివరించారు.

## రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు బుధవారం కేంద్రమంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు 'కాంగ్రెస్ పార్టీ అవకాశవాద రాజకీయాలకు, అవినీతి పాలనకు నిలువెత్తు రూపం. భారాస పదేళ్ల పాలన కంటే రెట్టింపు స్థాయిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 15 నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించుకోలేకపోయారు. మల్కాజిగిరి స్థానాన్ని కూడా నిలబెట్టుకోలేకపోయారు. స్వయంగా పోటీ చేసిన కామారెడ్డిలో భాజపా చేతిలో ఓడిపోయి మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటమిని చవిచూశారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీ చేసే అభ్యర్థులే కరవయ్యారు. దిక్కులేక హైదరాబాద్‌ను మజ్లిస్ చేతిలో పెట్టడానికి సిద్ధమయ్యారు. భాజపాకు కంచుకోటైన గుజరాత్‌కు వెళ్లి తెలంగాణలో భాజపాను అడ్డుకుంటామని ప్రకటించడం పెద్ద జోక్. రిజర్వేషన్ల ముసుగులో మత విద్వేషాలు రెచ్చగొట్టేది కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలే' అని సంజయ్ పేర్కొన్నారు.

## గ్రూప్-1 మెరిట్ జాబితా వెల్లడి

- 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- నాంపల్లిలో ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో ప్రక్రియ

**హైదరాబాద్:** రాష్ట్రంలో 563 గ్రూప్-1 సర్వీసుల ఉద్యోగాల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన కోసం టీజీపీఎస్సీ 1:1 నిష్పత్తిలో మెరిట్ జాబితాను ప్రకటించింది. గ్రూప్-1లో ఇంటర్వ్యూలు లేకపోవడంతో 1:2కి బదులుగా నేరుగా 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచింది. ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం (పూర్వ పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం) పాత క్యాంపస్‌లో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనుంది. ఈ ప్రక్రియకు ఈ నెల 22వ తేదీని రిజర్వు డేగా ప్రకటించింది. గడువు ప్రకారం నిర్ణీత తేదీల్లో హాజరుకాకున్నా, ఎవరివైనా ఒరిజినల్ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నా... అలాంటి వారి కోసం పరిశీలన కేంద్రం 22న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పనిచేస్తుంది. మెరిట్ జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వెబ్ అప్షన్లను నమోదు చేయాలని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికొలస్ స్పష్టంచేశారు. ప్రధాన పరీక్షల్లో చూపిన ప్రతిభ, రిజర్వేషన్లు, మల్టీజోన్ల వారీగా పోస్టులను పరిగణనలోకి తీసుకుని 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశామని, ఈ జాబితాను వెబ్‌సైట్లో పొందుపరచినట్లు తెలిపారు. "అభ్యర్థులు ఈ నెల 10 నుంచి పరిశీలన కోసం అవసరమైన మెటీరియల్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను, వాటి రెండు సెట్ల జిరాక్సు ప్రతులను తీసుకురావాలి. నిర్ణీత తేదీలు, రిజర్వుడే రోజున ధ్రువపత్రాలు తీసుకురాని వారికి తదుపరి సమయం ఇవ్వబోం. ధ్రువపత్రాల పరిశీలనకు ఎవరైనా గైర్హాజరైనా, ఎవరిదైనా అభ్యర్థిత్వం తిరస్కరణకు గురైనా, అప్షన్లను నమోదు చేయకున్నా... వారి స్థానంలో తదుపరి మెరిట్ అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తాం" అని వివరించారు.

## జూన్ 30 వరకు ధాన్యం కొనుగోళ్లు

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం నాటికి 1,838 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. ఏప్రిల్ 9వ తేదీ నాటికి 95,131 టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 9,973 టన్నులు కాగా, సన్న రకం 85,158 టన్నులు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన వడ్ల కనీస మద్దతు ధర విలువ రూ.220.70 కోట్లు కాగా, రూ.46.54 కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో వేశారు. రైతుల నుంచి కొన్న సన్న వడ్లకు ఇవ్వాల్సిన బోనస్ మొత్తం రూ.4.99 కోట్లు కాగా.. ఈ చెల్లింపులు మొదలు కావాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 92,724 టన్నులు మిల్లులకు తరలించారు. మరో 2,407 టన్నులు కేంద్రాల్లో ఉంది.

### ముందు వరుసలో నిజామాబాద్, నల్గొండ జిల్లాలు

నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే వరి సాగు, కోతలు ముందే మొదలవుతాయి. ధాన్యం కొనుగోళ్లలోనూ ఈ జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,838 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతుండగా.. ఒక్క నిజామాబాద్‌లోనే 464 కేంద్రాలున్నాయి. ఆ తర్వాత అత్యధికంగా నల్గొండలో 250 కేంద్రాలు ఉన్నాయి. కామారెడ్డిలో 241, సిద్దిపేటలో 230 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1.37 కోట్ల టన్నుల దిగుబడి వస్తుందన్నది అంచనా కాగా, 70.13 లక్షల టన్నులు కొనుగోలు చేయాలని పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

## మోడీతో దేశానికి తీవ్ర నష్టం

- ఆయనను తప్పిస్తేనే దేశానికి మోక్షం
- రాహుల్ ఆదేశాలతో కులగణన చేపట్టాం
- తెలంగాణ విముక్తికి పటేల్ కారణం
- తెలంగాణ ఇచ్చిన సోనియా ధన్యురాలు
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో రేవంత్ వ్యాఖ్యలు

**అహ్మదాబాద్, ఏప్రిల్ 9 :** ప్రధాని మోదీ మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని విభజించాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. మోడీని తప్పిస్తే తప్ప దేశానికి విముక్తి లేదని అన్నారు. గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ గాడ్సే సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్నారని రేవంత్ విమర్శించారు. దేశ యువత ఏకం కావాల్సిన సమయమొచ్చిందన్నారు. యువతకు గాంధీ బాటలో నడుస్తూ.. మోదీ, గాడ్సేలను ఓడించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటే ప్రధాని మోదీకి భయం.. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాడనే లోక్‌సభలో రాహుల్ గాంధీకి మైక్ ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంలో మోదీకి, అమిత్ షాకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. నెహ్రూ నేతృత్వంలో పటేల్ నిజాం నుంచి తెలంగాణకు విముక్తి కలిగించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియాగాంధీ.. దేశాన్ని విభజించడమే మోదీ లక్ష్యం అందుకే తెలంగాణలో బీజేపీని, మోదీని అడుగు పెట్టనివ్వం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తుంది. దేశ యువత ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన టైం వచ్చిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో కుల గణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణే అని గర్వంగా తెలిపారు. రాష్ట్రంలోని కుల గణనను తాము విజయవంతంగా పూర్తి చేశామని, అదే తరహాలో దేశవ్యాప్తంగా కూడా జనాభా గణనతో పాటు కుల గణన జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం 21 వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేశామని వెల్లడించారు. రైతులపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపాలనలో దేశానికి అభివృద్ధి కన్నా మోసం ఎక్కువగా జరిగిందని ఆరోపించారు. రాహుల్ గాంధీతో కలిసి గాంధీ పరివారమంతా పనిచేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, నైతికత కోసం పోరాడే నాయకుడిగా రాహుల్ గాంధీని ఆదరించాలని కోరారు. కాగా మోడీ పరివారాన్ని గాడ్సే పరివారంగా అభివర్ణించి తీవ్ర విమర్శలు చేశారు. బ్రిటిష్ వాళ్లు ఎలా దేశ సంపదను లూటీ చేశారో, అదే బాటలో బీజేపీ నాయకులు కూడా నడుస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజల ఆస్తులు ప్రైవేటు కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. వచ్చే రోజుల్లో దేశం మీద విపరీతంగా పెరుగుతున్న బీజేపీ చెరను తొలగించాలన్న బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ అడుగుపెట్టనివ్వక పోవడం తమ గెలుపు సూచిక అని పేర్కొన్నారు.

## పెట్రోల ధరలతో కేంద్రం ఆర్థిక దోపిడీ

- సెస్సు వసూళ్లతో సొంత రాజకీయ ప్రచారాలు
- సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మోడీ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి కేటీఆర్ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** పెట్రోల్ రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడు తుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. ఆకాశాన్నంటుతున్న పెట్రో ధరలపై కేంద్ర పెట్రోలియం,సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి బహిరంగ లేఖ రాసిన కేటీఆర్, ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్‌పీజీ ధరలు భారత్‌లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,100 దాటడం పేద, మధ్యతర గతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు కేటీఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్‌గా మారిందన్నారు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులతో పాటు బిజెపి నేతలు అంతా గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్ గ్యాస్ ధరల వలన పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్లు- పండగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం 'మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్'గా మారిందని విమర్శించారు. మోడీ చెప్పిన 'అచ్ఛే దిన్' అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా? సరుకులు కొనుక్కోవాలా? అన్న మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని కేటీఆర్ ప్రశ్నించారు. దేశంలోని కోట్లాది ప్రజల తరపున రాసిన ఈ లేఖలో, ప్రజల తరపున కొన్ని డిమాండ్లను కేంద్రమంత్రి ముందు కేటీఆర్ ఉంచారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రూడ్ ధరలకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలన్నారు. ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆర్థిక కేంద్రీకరణ విధానాలను విడనాడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు. దేశ ప్రజలు పెట్టు-కున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన సమయం కేంద్రప్రభుత్వానికి వచ్చిందన్నారు కేటీఆర్. ఆకట్టుకునే నినాదాల వెనుక దాక్కోవడం మాని, అసలైన పని చేయాలని కేటీఆర్ ఊచించారు.

## పాత వాహనాలకూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

- సెప్టెంబరు 30లోగా బిగించుకోవాల్సిందే
- లేదంటే బీమా సహా అన్ని సేవలూ బంద్
- కేసులూ నమోదు చేస్తారు

**హైదరాబాద్:** పాత వాహనాన్ని ఉపయోగిస్తున్నారా? అది 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముందు తయారైందా? అయితే.. దానికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ) బిగించుకోవాల్సిందే. ద్విచక్ర వాహనం నుంచి నాలుగు చక్రాల బండ్ల వరకు ఏవైనా సరే ఇకపై ఈ నంబర్ ప్లేట్‌ను తప్పనిసరిగా అమర్చుకోవాల్సిందే. దీనికి రవాణాశాఖ సెప్టెంబరు 30వ తేదీని గడువుగా నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వాహన రకాన్ని బట్టి నంబర్ ప్లేట్‌కు కనిష్ఠంగా రూ.320.. గరిష్ఠంగా రూ.800గా ఛార్జీలను ఖరారు చేసింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడం, దొంగతనాలను అరికట్టడం, వాహనాలు రహదారి భద్రత లక్ష్యంగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో రవాణాశాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి తయారైన వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్ నిబంధన ఇప్పటికే అమలవుతోంది. ఇప్పుడు పాత వాహనాలకూ దీన్ని తప్పనిసరి చేశారు.

వాహన యజమానిదే బాధ్యత

- పాత వాహనాలకు కొత్తనంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత వాహన యజమానిదే అని రవాణాశాఖ తెలిపింది. అది లేని వాహనాలను అమ్మాలన్నా.. కొనాలన్నా రవాణా కార్యాలయంలో పేరు మార్చుకోవడం సాధ్యం కాదు.
- వాహన బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి కూడా జారీ చేయరు. గడువు తర్వాత హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేస్తారు.
- వాహన తయారీ సంస్థలు తమ డీలర్ల వద్ద హెచ్ఎస్ఆర్‌పీ బిగించే సదుపాయాన్ని కల్పించాలి. ఈ సమాచారం, నంబర్ ప్లేట్ ధరలు డీలర్ల దగ్గర కనిపించేలా ప్రదర్శించాలి. వాహనదారు ఇంటికే వెళ్లి నంబర్ ప్లేట్ బిగిస్తే అదనంగా రుసుం తీసుకోవచ్చు.
- వాహనదారులు ఈ ప్లేట్ కోసం www.siam.in వెబ్‌సైట్‌లో ..వాహన వివరాలు నమోదు చేసి బుక్ చేసుకోవాలి. కొత్త ప్లేట్ బిగించాక ఆ ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

## సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ సన్నద్ధం

### డీజీపీ జితేందర్ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** వాణిజ్య రంగంలో మారుతున్న సవాళ్లకు తగిన విధంగా స్పందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ముందడుగు వేస్తోందని డీజీపీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా సైబర్ ఫ్రాడ్ నేరాలను అరికట్టేందుకు ఐజీ ర్యాంక్ అధికారిని ప్రత్యేకంగా నియమించామన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీ-మ్‌ను ఏర్పాటు చేయడం, వారి ప్రయాణ సౌకర్యార్థం షీ షటిల్ బస్సులు అందుబాటులోకి తేవడం వంటి చర్యలను వివరించారు. తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో మెరుగైన పోలీస్ నిఘా , ప్రజా భద్రతపై రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంకేతిక పోలీసింగ్, సైబర్ భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల భద్రతా సహకారంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల మధ్య భద్రత విషయంలో అంతరాన్ని తగ్గించడమే ఈ సమావేశ ఉద్దేశం అన్నారు. పరిశ్రమల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వేధింపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖకు రూ.800 కోట్లు మంజూరు చేసినట్లు- జితేందర్ తెలిపారు. 100 డయల్ సేవలు మెరుగు పడటంతోపాటు పోలీస్ పనితీరు దేశంలోనే కాక, అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంటోందని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధి పోలీస్ భద్రతపై ఆధారపడి ఉంది. శాంతి భద్రతలను కాపాడడంలో మా బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్నాం, అని డీజీపీ జితేందర్ తెలిపారు.

## మాజీ గవర్నర్ తమిళసైకి పితృ వియోగం

### సంతాపం తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ తండ్రి,తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొప్ప సాహితీవేత్త కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహాత్ముడి సిద్ధాంతాలను పునికిపుచ్చుకున్న దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు, అనంతన్ గారిని కోల్పోవడం ఎంతో బాధాకరం అని పేర్కొన్నారు. కుమారి అనంతన్ నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళ సై కి, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. అనంతన్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అటకెక్కించారు

- ఒక్క హామీ అమలు చేయలేక చతికిలపడ్డారు
- కేసీఆర్‌ది సాగుభాష.. రేవంత్‌ది చావు భాష
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 :** కేసీఆర్‌ది సాగు భాష అయితే.. రేవంత్ రెడ్డిది చావు భాష అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవన్నది ప్రజలకు అర్థమయి పోయిందన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి ఆదర్శ్ రెడ్డి పాదయాత్ర అనంతరం బుధవారం సిద్ధి వినాయక దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ రోజు రాష్ట్రమంతా కూడా కేసీఆర్ వైపు చూస్తున్నది. ఏడాది పాలనలో ప్రజలకు పాలేవో,నీళ్ళేవో అర్థం అయిపోయింది. నో ఎల్ఆర్ఎస్ అని అన్నారు కానీ ఇప్పుడు ఎల్ఆర్ఎస్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మేము వస్తే ఫార్మాసిటీ భూములన్ని రైతులకు వాపసిస్తామని అన్నారు. ఇప్పుడేమో 16 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం స్వీకరిస్తామని ప్రకటించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్‌ది సాగు భాష అయితే రేవంత్ రెడ్డిది చావు భాష. కేసీఆర్ ఎప్పుడు మాట్లాడిన మిషన్ కాకతీయ కింద చెరువులు బాగు చేయాలి అనేది. ప్రాజెక్టుల నిర్మాణం చేసి రైతులకు నీళ్లు అందించాలని చెప్పేది. రేవంత్ రెడ్డి మాట్లాడితే పేగులు మెడలో వేసుకుంటా, తొక్కుతా చంపుతా తొడలదర కొడతా ఇలాంటి భాష రేవంత్ రెడ్డిది. ఢిల్లీలో కూడా రేవంత్ రెడ్డి పని అయిపోయింది. ఢిల్లీలో బిసి సభకు రాహుల్ గాంధీని తీసుకొని వస్తా పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేస్తానని అన్నాడు. వీళ్ళ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఢిల్లీలో ఉండి కూడా ధర్నాకు రాలేదు. రాహుల్ గాంధీ, సోనియాగాంధీ మరుసటి రోజు రేవంత్ రెడ్డి లేకుండా పిసిసి అధ్యక్షులతో ఉపముఖ్యమంత్రితో ఫోటోలు దిగారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మొన్న ఒక స్టేట్‌మెంట్ ఇచ్చాడు. హెచ్‌సీయూ విద్యార్థుల మీద పెట్టిన కేసులు ఎత్తేస్తున్నామని ప్రకటించారు. ఈ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి ఆదేశించిందట ఉపముఖ్యమంత్రి కేసులు ఉపసంహరించుకుంటారంట. ముఖ్యమంత్రి హోంమంత్రి రేవంత్ రెడ్డి కేసులు పెడితే ఉపముఖ్యమంత్రి కేసులు ఉపసంహరించు కుంటాడు అంట. ఇదేమి రాజ్యం. తోక కుక్క నాడిస్తున్నదా కుక్క తోక నాడిస్తున్నదా అర్థం కావడం లేదు. రేవంత్ రెడ్డి పెట్టింది తప్పుడు కేసులని ఉపముఖ్యమంత్రి బట్టి భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా..? హెచ్‌సీయూ విద్యార్థులపై అక్రమంగా కేసులు పెట్టారని విడుదల చేసినట్టే కదా? అక్రమ కేసులో పెట్టినందుకు రాష్ట్ర హోం మంత్రిగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి హెచ్‌సీయూ విద్యార్థుల కు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేసీఆర్ ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలబెడితే.. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను పడగొట్టిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర జీఎస్టీ ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం 12 శాతం జీఎస్టీ వృద్ధిరేటు ఉండేది. దేశ జీఎస్టీ కంటే సగానికి తెలంగాణ జిఎస్టి వృద్ధిరేటు పడిపోయింది. దేశం 10 శాతం జీఎస్టీ వృద్ధిరేటు సాధిస్తే తెలంగాణ కేవలం 5 శాతం మాత్రమే వృద్ధిరేటు సాధించింది. కేసీఆర్ ఉన్నప్పుడు దేశ జిఎస్టి వృద్ధి రేటు కంటే ఎప్పుడూ ఎక్కువగానే ఉన్నాం తప్ప తక్కువగా లేం అని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్ చెట్లు పెడితే రేవంత్ రెడ్డి వాటిని నరుకుతున్నాడు. మొన్న అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాల భూమి తీసుకొని అక్కడ చెట్లని నరికేసిండు. నిన్న హెచ్ సీయు భూముల్లో 400 ఎకరాల అడవుల్లోనూ నరికి మూగజీవుల పాపం కట్టుకున్నాడు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూలగొట్టాడు రేవంత్ రెడ్డి. ఒక చిన్న పిల్ల వాళ్ళ నాన్న కొనిచ్చిన వాటర్ బాటిల్ తీసుకొని వస్తాను అన్నా వినకుండా ఇల్లును కూలగొట్టారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. జీవో 58,59 కింద ఇదే పటాన్‌చెరు నియోజకవర్గంలో వేల మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశాం. ఈరోజు రేవంత్ రెడ్డి వచ్చాక 58, 59 జీవో బంద్ పెట్టిండు. పైసలు కట్టినోళ్లకు కూడా పట్టాలు ఇవ్వడం లేదు. రైతుబంధు ఎగ్గొట్టిండు. రుణమాఫీ కూడా కాలేదు, రైతుబంధు రాలే, 4000 పెన్షన్ రాలే, అక్కచెల్లెళ్లకు మహాలక్ష్మి పెన్షన్ రాలే. కేసీఆర్ ఎన్నికల హామీ ఇవ్వకపోయినా 13 లక్షల పేదింటి ఆడపిల్లల కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించారు. ఇప్పుడు పెళ్లయి పిల్లలు పుట్టినా కల్యాణ లక్ష్మి చెక్కు లేదు తులం బంగారం పూసే లేదు అని హరీశ్‌రావు విమర్శించారు.

## భారతదేశంలో జైనానిది విడదీయలేని బంధం

- ఉగ్రవాదం లాంటి సవాళ్లకు జైనమత విలువలే సమాధానం
- మహావీర్ జయంత్యుత్సవంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** భారత దేశానికి గుర్తింపు తీసుకురావడంలో.. జైన మతం వెలకట్టలేని పాత్రను పోషించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచానికి సవాళ్లుగా మారిన ఉగ్రవాదం, యుద్ధం, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలకు.. జైన మత విలువలు సమాధానం ఇవ్వగలవన్నారు. నవకర మహామంత్ర దివస్ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రాచీన మతానికి చెందిన సంప్రదాయాన్ని, వారసత్వాన్ని, ప్రబోధనలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ తెలిపారు. పార్లమెంట్ బిల్డింగ్ లో జైన తీర్థంకరుల విగ్రహాలు ఉన్నట్లు- చెప్పారు. జైన మతంలో ఉన్న అనేకాంతవాదం గురించి ఆయన ప్రస్తావించారు. నిజం అనేది అనేక రూపాల్లో వ్యక్తం అవుతుందన్నారు. జైన మతంలో ఒకరిపై ఒకరు ఆధారపడుతారన్న వాస్తవాన్ని గుర్తింపు ఉందని, అందుకే వాళ్లు స్వల్ప స్థాయిలో కూడా హింసను ఆమోదించరన్నారు. శాంతి, సామర్యం, పర్యావరణ పరిరక్షణలో ఇదే కీలకం అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి జైన సాహిత్యం వెన్నుముకగా నిలుస్తుందన్నారు.

## కోలుకుంటున్న మార్క్ శంకర్

- మరో మూడు రోజులు ఆస్పత్రిలోనే చికిత్స
- కొడుకు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో పవన్ సంప్రదింపులు
- మార్క్ ఫోటోను విడుదల చేసిన కుటుంబ సభ్యులు

**అమరావతి, ఏప్రిల్ 9 :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. సింగపూర్‌లోని స్కూల్లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడ్డ సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అప్పటిక ప్పుడు సింగపూర్‌కి బయలుదేరి వెళ్లగా.. పవన్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ కూడా మార్క్‌ని చూడడానికి వెళ్లారు. అయితే తాజాగా మార్క్ శంకర్ ఆసుపత్రిలో కోలు కుంటున్నట్లు ఫొటోను కుటుంబసభ్యులు విడుదల చేశారు. ఈ ఫొటోలో మార్క్ విజయానికి సంకేతం చూపిస్తున్నట్లుగా పోజ్ ఇచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు మార్క్ పూర్తిగా కోలుకోవడానికి మూడు రోజులు పట్టనున్నట్లు సమాచారం. గత రాత్రి హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు పవన్ కళ్యాణ్ సహా చిరంజీవి దంపతులు వెళ్లారు. పవన్ కళ్యాణ్ నేరుగా ఆసుపత్రికి చేరుకొని మార్క్‌ను కలిశారు. చేతులు, కాళ్లకు కాలిన గాయాలు కావడంతో పాటు, ఊపిరితిత్తులకు పొగ చేరడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ వైద్యులు, అధికారులతో పవన్ కళ్యాణ్ ఇప్పటికే మాట్లాడారు. మార్క్ కోలుకుంటున్నాడని, ఊపిరితిత్తుల దగ్గర పొగ చేరడంతో ఆ కారణంగా తలెత్తే ఆరోగ్యపరమైన ఇబ్బందుల గురించి పరీక్షలు చేస్తున్నామని వారు పవన్ దృష్టికి తీసుకొచ్చారు. మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే మార్క్‌కు పరీక్షలు చేయాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. అయితే, తాజాగా మార్క్ శంకర్‌కు సంబంధించిన ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో మార్క్ కాళ్లకు గానీ, చేతులకు గానీ ఇబ్బంది పెట్టే అంత గాయాలు అయితే కనిపించడం లేదు. మోచేతి దగ్గర ఒక కట్టుతో పాటు, ముఖానికి ఆక్సిజన్ సిలిండర్‌తో మార్క్ కనిపిస్తున్నాడు. రెండు చేతులతో థమ్స్‌అప్ చూపిస్తూ, తాను బాగానే ఉన్నానని చెప్పే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది.

## ధైర్యంగా ఉండు.. లిటిల్ వారియర్

### జూనియర్ ఎన్టీఆర్ పోస్ట్

**అమరావతి :** పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ సింగపూర్‌లోని స్కూల్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో గాయపడి కోలుకుంటున్నాడు. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ ఘటనపై ఇప్పటికే పలువురు రాజకీయ నేతలతో పాటు- పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలుపుతున్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఈ ఘటనపై స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ కుమారుడు గాయపడిన విషయం తెలిసి తాను ఎంతో బాధపడినట్లు తెలిపారు. చిన్నారి మార్క్ శంకర్ త్వరగా ఆరోగ్యం పొందాలని ఎక్స్ వేదిక ద్వారా తారక్ కోరుకున్నారు. 'ధైర్యంగా ఉండు లిటిల్ వారియర్' అంటూ ఒక పోస్ట్‌ను షేర్ చేశారు.

## గృహవినియోగదారులకు శుభవార్త

- మరింత తగ్గనున్న ఈఎంఐ భారం
- ఆర్‌బిఐ నిర్ణయంపై రియల్టర్ల ఆనందం

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** రెపోరేటు తగ్గడంతో గృహరుణ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోమారు శుభవార్త చెప్పింది. దీంతో వడ్డీలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. స్తబ్దుగా ఉన్న రియల్ రంగానికి ఇది బూమ్ ఇస్తుందని రియల్ ఎస్టే వర్గాలు చెబుతున్నాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో వడ్డీ రేట్లు తగ్గి గృహ విక్రయాలు పుంజుకుంటాయని రియల్ ఎస్టేట్ సమాఖ్యలు క్రెడాయ్, నరెడ్కో ఆశాభావం వ్యక్తం చేశాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంపై హర్షాతిరేకం వ్యక్తం చేశాయి. వృద్ధికి ఊతమిచ్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి కూడా దన్నుగా నిలుస్తుందని పేర్కొంటున్నాయి. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని బ్యాంకులు ఎంత వేగం అమలుచేసి.. వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయడంపై ఈ ఊరట ఆధారపడి ఉంటుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటుపై తీసుకున్న రుణాలను బ్యాంకులు వెంటనే సవరించాల్సి ఉంటు-ంది. మూడు నెలలకోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నాయి. ఒకవేళ ఫిబ్రవరి నెల ప్రయోజనాన్ని ఇప్పటికీ బ్యాంకులు తగ్గించకపోతే మే నెల నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఆర్‌బీఐ వరుసగా రెండోసారి కూడా రెపో రేట్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఇలా వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాది ఇది రెండోసారి. ఫిబ్రవరి 7న కూడా 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అంతేకాదు భవిష్యత్‌లో మరిన్ని కోతలు ఉండే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఎన్నాళ్లగానో ఈఎంఐ భారం మోస్తున్న గృహరుణ వినియోగదారులకు మరోమారు ఊరట కలిగిందనే చెప్పాలి. ఎవరైతే ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకొని ఉంటారో వారికి ఈఎంఐ తగ్గనుంది. ముఖ్యంగా 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి ఆ మేర బ్యాంకులు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెండు దఫాల్లో ఇప్పటివరకు 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఆ మేర ఈఎంఐ తగ్గుతుంది.

## ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని అమ్మేస్తారు

- ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేట్ పరం అవుతున్నాయి
- ఎన్నికల సంస్థలు కూడా మోడీ గుప్పిట చిక్కుకున్నాయి
- బ్యాలెట్ పోరే దేశానికి శ్రీరామరక్ష
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** ప్రధాని మోడీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్ అహ్మదాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ-(ఎఐసిసి) సమావేశాలు జరుగుతున్నాయి. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం నెలకొల్పబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ దెబ్బతింది. వారు బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారు ప్రభుత్వరంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ.. తమ స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఇదే కొనసాగితే.. మోడీ ఏదో ఒకరోజు ఈ దేశాన్ని అమ్మేస్తారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన ప్రభుత్వ రంగ కర్మాగారాలను నాశనం చేస్తున్నారు. మీరు, నేను దేశం కోసం ఏం చేస్తున్నాం? భవిష్యత్ తరాలకు మనం ఏమి ఇవ్వాలనుకుంటున్నాము? కాంగ్రెస్‌ను దుర్భాలాషలాడడం తప్ప మోడీ దగ్గర వేరే సమాధానాలు లేవు అని ఆయన అన్నారు. నేడు ఎన్నికల సంస్థలు కూడా వారి నియంత్రణలోకే వెళ్లాయి. ప్రభుత్వం ప్రతిదానిలో జోక్యం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో.. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఇవిఎంలను వదిలి బ్యాలెట్‌పేపర్స్ వైపు మళ్లాయి. ప్రపంచంలో ఇవిఎంలు ఎక్కడా అందుబాటులో లేవు. దేశంలో 140 కోట్ల మంది ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారు. ఇప్పుడో లేక తరువాతో.. ఈ దేశ యువత మనకు ఇవిఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్లు కావాలని నినదిస్తారు అని ఖర్గే అన్నారు.భారత్‌పై అమెరికా 26 శాతం పన్నులను విధించింది. ఈ విషయంపై పార్లమెంటు చర్చించనీయలేదు. ఈ విషయంపై మేము చర్చించాలని పట్టుబట్టాము. కానీ వారు చర్చకు అనుమతించలేదు. ముఖ్యమైన ప్రజా సమస్యలను చర్చించడానికి బదులుగా.. ప్రభుత్వం పార్లమెంటులో మత విభజన గురించి చర్చించింది. దీనికోసం తెల్లవారుజామున 3-4 గంటల వరకు చర్చలు నిర్వహించింది. మణిపూర్ వంటి అంశాలపై ఉదయం 4.40 గంటలకు ప్రారంభమైంది. ఆరోజు మణిపూర్ అంశంపై మేము తరువాతరోజు మాట్లాడతామని అమిత్‌షాకు చెప్పాము. దీంతో ఈ విషయంపై మమ్మల్ని చర్చకే అనుమతించలేదు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేతలు ఇలాంటివి చేస్తున్నారు అని ఖర్గే విమర్శించారు. ఈ ప్రభుత్వానికి యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు. దేశంలో అన్నింటా ప్రభుత్వ ఆధిపత్యమే కొనసాగుతున్నదని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నదని, అందుకే ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

## తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు

### కేంద్ర కేబినేట్ ఆమోదం: అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఎపిలో పలు రైలు మార్గాల ఆధునీకరణకు ఆమోదం లభించిందన్నారు. రూ.1,332 కోట్లతో తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి వివరించారు. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో పర్యాటకంగా ఎంతో అభివృద్ధి జరిగేందుకు ఆస్కారం ఉంటు-ంది. లక్షల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ ప్రాంతంలోనే ఉన్నాయి. తిరుపతి-వెల్లూరు మార్గం వైద్య, విద్య పరంగా ఎంతో కీలకం. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో 400 గ్రామాల్లోని 14 లక్షల మంది జనాభాకు లబ్ధి చేకూరుతుంది. 35 లక్షల పనిదినాలు కల్పించేందుకు అవకాశం ఉంటుంది. ఏడాదికి 4 మిలియన్ టన్నుల సరకు రవాణాకు అవకాశం ఉంటుంది' అని కేంద్ర మంత్రి వెల్లడించారు.

## విభజన సమస్యలపై కేంద్రం దృష్టి

### ఆయా శాఖలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** విభజన సమస్యలకు మెల్లగా పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఆయా సమస్యలపై కేంద్రం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అనేక అంశాలపై చర్చలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్రహోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు-ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు- విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది. ఈ సమీక్ష సమావేశంలో అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల పక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని.. రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని.. దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గతంలో ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచించింది.

## 'క్యుములోనింబస్' ప్రభావం..

### తెలంగాణలో రెండు రోజులు వర్షాలు

**హైదరాబాద్:** క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ, రేపు తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే సూచనలున్నాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయని వెల్లడించింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటనలో పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది. ఏప్రిల్ 10న (గురువారం) రాష్ట్రంలోని సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# వడ్డీలు.. పన్నుల్లో హేతుబద్ధత ఉండాలి!

ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధానం కారణంగా కొంత వెసులబాటు కలుగుతోంది. అయితే ఇది మరింతగా ప్రజలరు ఆదుకునేలా ఉండాలి. వడ్డీ రేట్లు ప్రజలకు, వ్యాపారులకు, ఉద్యోగులకు అనువుగా ఉండాలి. వారు భరించేవిగా ఉండాలి. పన్నులు కూడా హేతుబద్ధంగా ఉండాలి. విపరీతంగా పన్నులు, వడ్డీలు వసూలు చేస్తే ప్రజలు భరించలేరని గుర్తించాలి. స్వయం ఉపాధి పొందే వారికి,చవుపుకునే వారికి ఉపయుక్తంగా ఉండాలి. డబ్బు వినిమయం, వస్తు కొనుగోళ్లకు అవినాభావ సంబంధం ఉంది. డబ్బు మార్కెట్లో చలామణి అవుతూనే వస్తూత్పత్తి అన్నది ప్రజలకు చేరాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా పరపతి విధానం ఉండాలి. అది ఇల్లు కావు, ఇతర పదార్థాలు కావచ్చు. అలాగే పెట్రో ధరలు, గ్యాస్ ధరలు కూడా ప్రజల కొనుగోలు శక్తికి మించి ఉండరాదు. ఇవి వస్తువుల ధరలు కూడా నియంత్రిస్తుంటాయి. వీటి ధరల ఆధారంగానే మార్కెట్లో వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇవి బ్యాలెన్స్ చేయడం అన్నది ప్రభుత్వం నడిపిస్తున్న వారికి అవసరం. అదేపనిగా ఉచిత పథకాల కారణంగా సమాజంలో పనిచేసే వారు తగ్గిపోతున్నారు. తినికూర్చునే వారు పెరుగు తున్నారు. దీంతో వస్తూత్పత్తి కూడా తగ్గుతుంది. ఇది కూడా గమనించాల్సి ఉంది.ఇకపోతే ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించ లేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మాత్రం పెరగడంలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించివేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగుతోంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. అప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకోగ లరు. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగు దల వలన అదనపు ఆదాయం సమకూరుతోంది. ఆ విధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడా నికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో వినియోగిస్తోంది.

అలాగే మరిన్ని ఉచిత పథకాలకు వెచ్చిస్తున్నారు. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ వుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు ముందు అంచనా వేసినట్టుగా ఉండడం లేదని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ట్రంప్ విధానాలు, పాలస్తీనా,ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజా ఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది.

ఇకపోతే మనదగ్గర పంటలు బాగానే పండుతున్నాయి. మిర్చి, పప్పు ధాన్యాలు విపరీతంగా పండుతున్నాయి. వరి లెక్కకు మించి పండిస్తున్నారు. అయితే ఈ ధరలు ప్రజలకు చేరడం లేదు. తాజాగా ఆక్వా రైతులు ట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతున్నారు. చికెన్, మటన్ ధరలు విపరీతంగా పెరుగుతున్నా ఆక్వా సామాన్యులకు అందుబాటు లోకి లేదు. దానిని ప్రజల చెంతకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. ప్రజలకు మనదేశంలో లభిస్తున్న ఆహార ఉత్పత్తులు సరసమైన ధరలకు చేరాలి. ప్రధానంగా రొయ్యలను ఇంటింటికీ చేరుకునేలా చేయాలి. 140 కోట్లు జనాభా ఉన్న మనదేశంలో మాంసాహారులు కూడా ఎక్కువే. అమెరికా సుంకాలకు భయపడి కూర్చోకుండా ఆక్వాను ప్రజలకు అందించేలా ప్రణాళికలు చేయాలి. ఇకపోతే ట్రంపం సుంకాలను విమర్శిస్తున్న మనం ..మనవద్ద మోడీ సుంకాలను పట్టించుకోవడం లేదు. దేశం ఆర్థికంగా నిలదొక్కుకుని ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే జిఎస్టీ వడ్డింపులు భారీగా తగ్గాలి. ఉచిత పథకాలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టాలి. తాయిలాలను పక్కన పెట్టాలి. కిలో రూపాయికే బియ్యం పథకానికి పాతరేయాలి. వడ్డీరేట్లు మరింతగా తగ్గాలి. విద్యార్థులు తీసుకునే విద్యారుణాలపై వడ్డీ నామమాత్రంగా ఉండేలా చూడాలి. ఇలా ఆలోచన చేసినప్పుడే, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. సంపాదించింది తిండికి కూడా సరిపోకపోతే దాని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పాలకులు, వారికి సలహాలు ఇస్తున్న మేధావులు గుర్తించాలి.

# ట్రంప్ నిర్ణయాలతో మార్కెట్లపై ప్రభావం

- ట్రంప్ సుంకాలపై చైనా ఎదురుదాడి
- ప్రతీకార సుంకాలతో బదులు తీర్చుకున్న డ్రాగన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ దేశం చైనా మధ్య టారిఫ్ వార్ మరింత ముదిరింది. ఈ వ్యవహారం ఆసియా మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ట్రంప్ సుంకాల నిర్ణయంతో లక్షల కోట్లు మదుపరుల పెట్టబడి ఆవిరవుతోంది. దేశంలో వ్యతిరేకత వస్తున్నా.. అనేక దేశాలు హెచ్చరిస్తున్నా ట్రంప్ మూర్ఖంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ట్రంప్ బెరింపులను చైనా కూడా పట్టించుకోవడం లేదు. అమెరికా ఇటీవల ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సుంకాలపై చైనా గట్టిగానే బదులిచ్చింది. డ్రాగన్ దేశం సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించింది. అయితే, సుంకాలను వెనక్కి తీసుకోవాలని.. లేకపోతే మరింత సుంకాలను ప్రకటించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. చైనా వెనక్కి తగ్గకపోవడంతో ట్రంప్ అన్నంత పని చేశారు. చైనా వస్తువులపై భారీగా సుంకాలను ప్రకటించారు. తాజా సుంకాలతో 104శాతానికి సుంకాలు చేరాయి. కొత్తగా ప్రకటించిన సుంకాలు వెంటనే అమలులోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఏప్రిల్ 2న అమెరికా చైనాపై 34శాతం సుంకాలను విధించింది. దీనికి స్పందనగా డ్రాగన్ దేశం సైతం అగ్రరాజ్యంపై 34శాతం సుంకాలు విధించింది. చైనా కొత్తగా ప్రకటించిన 34శాతం సుంకాలను ఉపసంహరించుకోకపోతే 50శాతం అదనంగా సుంకాలను ప్రకటిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఏప్రిల్ 9 నుంచి అమలులోకి వస్తాయని.. దాంతో పాటు చైనాతో అన్ని చర్చలు సైతం రద్దు చేస్తామని స్పష్టంచేశారు. దీనికి అమెరికా ప్రతీకార సుంకాలు ఏకపక్షమని.. రెచ్చగొట్టడమేనంటూ చైనా స్పందించింది. తాము సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించామని.. భవిష్యత్‌లో నూ మరిన్ని సుంకాలు పెంచుతామని ఘాటు-గా బదులిచ్చింది. సార్వ భౌమాధికారం, భద్రతా, అభివృద్ధి తదితర ప్రయోజనాలు కాపాడుకునేందుకు ప్రతీకార చర్యలు తీసుకుంటామని చైనా వాణిజ్యమం త్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 2న ట్రంప్ భారత్‌పై 26శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వియత్నాంపై 46 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, దక్షిణ కొరియాపై 25 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 20 శాతం సుంకాన్ని ప్రకటించారు. ఆయా దేశాలు అమెరికాపై చాలా ఎక్కువ సుంకాలను విధిస్తున్నాయ ని, వాటిపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యానిం చారు. యూఎస్-చైనా టారిఫ్ వార్ మరింత ముదిరే అవకాశం ఉన్నది. అమెరికా విధించిన కొత్తగా ప్రకటించిన సుంకాలపై చైనా సైతం ఎంత మేర సుంకాలు విధిస్తుందో చూడాల్సిందే. టారిఫ్ వార్ మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ టారిఫ్ వార్ కారణంగా ఇతర దేశాలపై సైతం భారీ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలిన విషయం తెలిసిందే. తాజాగా సుంకాల ప్రకటనతో మార్కెట్లు ఎలా గట్టెటెక్కుతాయో వేచి చూడాల్సిందే.

# దేశీయంగా సంస్కరణలకు ఇదే సమయం

- ట్రంప్-చైనా సుంకాల నేపత్యంలోజాగ్రత్తగా ఉండాలి
- పెట్టుబడులు ఆకర్శంచేలా వ్యవహరించాలి
- మాజీ ఆర్‌బిఐ గవర్నర్ రఘురామ రాజన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** ప్రస్తుతం అమెరికా-చైనా మధ్య తీవ్రస్థాయిలో జరుగుతున్న వాణిజ్యయుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు తలపడినప్పుడు వాణిజ్యంలో కొంత అస్థిరత ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధి పొందుతుందన్నారు. అయితే ట్రంప్ నిర్ణయాలతో అమెరికా సెల్ఫ్‌గోల్ చేసుకొందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. భారత్ చురుగ్గా వ్యవహరించి పెట్టుబడులు పెరిగేలా.. ఎగుమతులకు ప్రోత్సాహం లభించేలా అమెరికాతో వాణిజ్య చర్చలు జరపాలని అన్నారు. భారత్ ఇప్పుడు ఒక్క అమెరికా పైనే కాకుండా.. టారిఫ్‌ల విధానాన్నే పూర్తిగా సరళీకరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. భారత్ ఇప్పుడు ఆర్థిక రక్షణాత్మక వైఖరి నుంచి దూరంగా జరిగి.. వాణిజ్య, పెట్టుబడుల వాతావరణాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని రాజన్ అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితులను అవకాశాలుగా భావించి భారత్ నిర్ణయం తీసుకోవాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించేలా దేశీయంగా సంస్కరణలను చేపట్టాలని చెప్పారు. తూర్పు, ఉత్తర దేశాలతోపాటు ఆర్సీఈపీ, ఆసియాన్ వంటి గ్రూపులు, చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవాలన్నారు. బీజింగ్‌తో న్యూఢిల్లీ వాణిజ్య లోటు ఉన్నా.. బ్యాలెన్స్‌గా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ట్రంప్ నిర్ణయాలు స్వల్పకాలానికి అమెరికాకు సెల్ఫ్‌గోల్‌లా పనిచేస్తాయని రాజన్ హెచ్చరించారు. ఆ దేశంలో నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి.. ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించేందుకు సౌకర్యవంతంగా ఉన్న సమయంలో.. సొంత ఆర్థిక వ్యవస్థనే ఆయన పట్టాలు తప్పిస్తున్నారన్నారు. అమెరికాకు ఎగుమతులు చేయడంపై ఆధారపడిన వియత్నాం వంటి దేశాలు ఈ నిర్ణయాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయని చెప్పారు. వీటితో పోలిస్తే భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం పరిమితిగా ఉంటుందని చెప్పారు. మన జీడీపీతో పోలిస్తే ఎగుమతులు తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని రాజన్ అభిప్రాయపడ్డారు. మన వృద్ధిరేటు పైనా పెద్దగా ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బను తప్పించుకోవడానికి చైనా నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్న కంపెనీలకు భారత్ ఓ ఆకర్షణీయమైన ప్రదేశమని రాజన్ వెల్లడించారు. మనం సరైన నిర్ణయాలు తీసుకొంటే.. అమెరికా తక్కువ టారిఫ్‌లు విధించిన దేశాల్లో భారత్ ఉండటం, దేశీయంగా ఉన్న బలమైన మార్కెట్ వంటి భారీగా పెట్టుబడులను తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించే నిర్ణయాలు తీసుకోవడంతోపాటు.. పన్ను చట్టాలను మరింత సరళీకరించాలి. భారత్‌కు సేవారంగ ఎగుమతులకు మాత్రం టారిఫ్‌ల సెగ తాకలేదని చెప్పాలని రాజన్ వివరించారు. ఇటీ-వల కాలంలో దేశంలో సేవారంగ ఎగుమతులు తయారీ రంగాన్ని దాటేశాయన్నారు. ఇక అమెరికా టారిఫ్‌లు భారత్‌లో ద్రవ్యోల్బణ నియంత్రణకు కూడా ఉపయోగపడే అవకాశాలున్నాయని చెప్పారు. భారత ఎగుమతులు తూర్పు ఆసియా వంటి మార్కెట్ల వైపు చూస్తాయని.. అదే సమయంలో దేశీయ మార్కెట్లు కూడా వాటిని ఆకర్షిస్తాయని చెప్పారు. ఇక చైనా ఉత్పత్తులకు అమెరికాలో ప్రవేశం కష్టం కావడంతో.. భారత్ వైపు మళ్లే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. ఇక టారిఫ్‌లు ఇలానే కొనసాగితే మాత్రం ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని రాజన్ అంచనా వేశారు.

# కీలక వడ్డీరేట్లను సవరించిన ఆర్‌బిఐ

- వరుసగా రెండోసారి రెపోరేటు 0.25 శాతం మేర తగ్గింపు
- తగ్గనున్న గృహ, వాహన రుణాల వడ్డీల భారం
- ద్రవ్యపరపతి కమిటీ నిర్ణయాలు ప్రకటించిన గవర్నర్ మల్హోత్రా
- బంగారం రుణాలపై ఆంక్షలు విధించే యోచనలో ఆర్‌బిఐ

**ముంబై, ఏప్రిల్ 9 :** విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ మళ్లీ సవరించింది. వరుసగా రెండోసారి రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్లు- తగ్గించిన సంగతి తెలిసిందే. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు- ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీరేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపోరేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు- తగ్గించడం వల్ల .. బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది. దీని వల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటను 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు- ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు. తగ్గింపు నిర్ణయానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించ నున్నాయి. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించొచ్చని కూడా గవర్నర్ అభిప్రాయపడ్డారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు- 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధిరేటు వరుసగా 6.6శాతం, 6.3శాతం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4శాతానికి దిగి రావొచ్చని అంచనా. త్రైమాసికాల వారీగా 3.6శాతం, 3.9శాతం, 3.8శాతం, 4.4శాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వీటితో రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఇకపోతే బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి నిబంధనలు కఠినతరం కానున్నాయి. దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో ముత్తూట్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటి రుణ జారీ సంస్థల షేర్లు భారీగా క్షీణించాయి. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం ఇటీవల విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటిని అడ్డుకొనేందుకు ఆర్‌బీఐ చర్యలకు సిద్ధమవుతోందని కొన్నిరోజుల క్రితమే వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్‌బీఐ తాజాగా స్పందించింది. వివిధ రకాల నియంత్రణ సంస్థలు అనుసరిస్తున్న మార్గదర్శకాలను సమన్వయం చేయడంతో పాటు, సాధ్యమైనంత వరకు రిస్క్ తగ్గించేందుకు త్వరలో సమగ్ర నిబంధనలతో మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొంది. ఎంపీసీ సమావేశ వివరాల వెల్లడి సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బీఐ ప్రకటనతో ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు ఇంట్రాడేలో 10 శాతం మేర పతనం అయ్యాయి. బీఎస్ఈలో ఆ కంపెనీ షేర్లు రూ.2063కు చేరాయి. ఐఐఎఫ్ఎల్ షేర్లు సైతం 8 శాతం మేర క్షీణించాయి. మణప్పురం షేర్లు 3 శాతం, చోళమండలం షేర్లు 4.7 శాతం మేర పడ్డాయి. ముత్తూట్ ఫైనాన్స్ జారీ చేసే రుణాల్లో 98 శాతం వరకు బంగారం తాకట్టుగా పెట్టుకుని ఇచ్చేవే అధికం కావడంతో ఆ కంపెనీ షేర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యాయి. మణప్పురం 50 శాతం, ఐఐఎఫ్ఎల్ 21 శాతం చొప్పున మొత్తం రుణాల్లో వాటాను కలిగిఉన్నాయి. రుణాల జారీ విషయంలో ఆర్థిక సంస్థలేవీ ఒకేతరహా విధానాలు పాటించడం లేదని ఆర్‌బీఐ గుర్తించింది. బంగారం తాకట్టు రుణాల జారీ నుంచి ఆ నగదు వినియోగం, వేలం వరకు ఇలా ప్రతి దానికీ విధివిధానాలను ఖరారు చేసే అవకాశం ఉంది.

## వృద్ధిరేటులో అట్టడుగున తెలంగాణ

### కాంగ్రెస్ నిర్వాకంపై మండిపడ్డ కేటీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** జీఎస్డీపీ, తలసరి వృద్ధి రేటులో తెలంగాణ అట్టడుగున నిలవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వేసిన ఆర్థిక పునాదులను కాంగ్రెస్ సర్కార్ ధ్వంసం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. జీఎస్టీ వృద్ధిరేటు గుండు సున్నాగా నమోదు కావడంతో ఆయన ధ్వజమెత్తారు. సన్నాసి ఢిల్లీ పార్టీలను నమ్మితే.. తెలంగాణ బతుకు సున్నా అని మరోసారి రుజువుచేసిన సందర్భమిది అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలివి లేని దద్దమ్మను గద్దెనెక్కిస్తారు.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తారు.. కోట్లాది మంది జీవితాలతో చెలగాటమాడతారు అని కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఆర్థిక వృద్ధిలో అగ్రభాగాన ఉన్న రాష్ట్రాన్ని పాతాళానికి పడేసిన ఈ పాపం క్షమించరానిది. టూరిస్టు పార్టీలను నమ్మితే జరిగే విధ్వంసమిది.. విజన్ లేనోళ్ల చేతిలో రాష్ట్రాన్ని పెడితే జరిగే వినాశనమిది. నాటి పదేళ్ల దార్శనిక పాలనకు.. నేటి దగుల్బాజీ విధానాలకు మధ్య తేడాను నాలుగు కోట్ల సమాజం నిశితంగా గమనిస్తోంది. ఇక జీవితంలో ఈ ఢిల్లీ పార్టీలను తెలంగాణ నమ్మదు.. మళ్లీ ఎప్పటికీ మోసపోదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## రైతు సంక్షేమం లక్ష్యంగా కేసీఆర్ పాలన

- కాళేశ్వరం వృథా ప్రాజెక్ట్ అంటూ దుష్ప్రచారం
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో నష్టపోతున్న రైతులు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత రెడ్డి విమర్శలు

**నిజామాబాద్, ఏప్రిల్ 9 :** రైతు సంక్షేమం కోసం కేసీఆర్ అధికారంలో ఉండగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసారని నిజామాబాద్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేసిన ఘతన కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. అయితే ఇవేవీ పట్టించుకోకుం డా కాంగ్రెస్ ముందుకు సాగడంతో దౌర్భాగ్యం నెలకొందని అన్నారు. బుధవారం నాడిక్కడ మాట్లాడుతూ..రైతులను ఆదు కునేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని అన్నారు. ధాన్యం పండించిన రైతులను ఆదుకోని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాల వల్ల ధాన్యం దిగుబడులు పెరిగాయన్నారు. కానీ ఇప్పుడు పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరంను వృథా ప్రాజెక్టుగా చూపి పబ్బం గడుపుకోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రెలు పంపిణీ చేశారన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులను ఆదుకున్నామని అన్నారు. ఇలా కులవృత్తులను ఆదుకున్న ఘనత బిఆర్ఎస్‌దని అన్నారు.అన్ని వర్గల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు చేసి అమలు చేశారని వివరించారు. గోదావరి నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ లో నింపి అక్కడి నుంచి వివిధ ప్రాంతాల రైతులకు సాగునీరు అందించారని అన్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టులను నిర్మించడంతో ధాన్యం దిగుబడులు పెరిగాయని అన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతీ వరి గింజను తక్షణం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరికి ప్రజలు,రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులకు కష్టాలు తప్పటం లేదు. ఏ పంట వేసినా పెద్దగా రాబడి ఉండటం లేదు. నష్టాలు తప్ప లాభాలు రావటం లేదు. ఏదో ఒక కారణంతో అన్నదాతలకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవడానికి ముందుకు వచ్చి పలు పథకాలు అమలు చేసిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. వారికి ఆర్థిక భరోసా కల్పించానని అన్నారు. రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ చేసామన్నారు. పంట నష్టం వచ్చినపుడు కూడా ముందుండి మరీ సాయం చేసిన ఘనత కెసిఆర్‌దే అని వేముల అన్నారు.

## ఘనంగా ఎన్ఎస్యూఐ 55వ ఆవిర్భావ వేడుకలు

### భూక్యా సురేష్ నాయక్

**ఖమ్మం ఏప్రిల్ 9 అక్షర రేఖ ప్రతినిధి :** ఎన్.ఎస్.యూ.ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఖమ్మం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మంపట్టణంలోని సంజీవ్ రెడ్డి కార్యాలయంలో ముఖ్య అతిథులుగా పాల్గొన ఖమ్మం జిల్లా ప్రెసిడెంట్ పువాళ్ళ దుర్గాప్రసాద్ మరియు ఖమ్మం నగర అధ్యక్షుడు పి సీ సీ సభ్యులు మొహమ్మద్ జావేద్ కలిసి ఖమ్మం సంజీవ్ రెడీ భవనంలో ఎన్ ఎస్ యూ ఐ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఎన్ ఎస్ యూ ఐ ప్రెసిడెంట్ వేగినేటి ఉదయ్ మరియు ఖమ్మం నగర అధ్యక్షుడు పేరం యశ్వంత్ వర్ధన్ మాట్లాడుతూ, "ఎన్.ఎస్.యూ.ఐ 55 ఏళ్ల చరిత్రలో విద్యార్థుల హక్కుల కోసం, సామాజిక సేవల కోసం ఎన్నో పోరాటాలు చేసింది. ఆ తత్వాన్ని అనుసరిస్తూ మనం యువతగా సమాజంలో మార్పు తీసుకురావాలి," అన్నారు. అలాగే, విద్యా రంగంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎన్.ఎస్.యూ.ఐ ఎల్లప్పుడూ ముందుండిందని, నిరుద్యోగ సమస్య, ఫీజుల భారం, విద్యా నాణ్యత వంటి అంశాలపై పోరాటం కొనసాగుతుందని పేరం యశ్వంత్ వర్ధన్ తెలిపారు. "ఎన్.ఎస్.యూ.ఐ ఒక్క రాజకీయ వేదిక కాదు, ఇది ప్రతి విద్యార్థి కోసం ఉన్న న్యాయ పోరాట వేదిక," అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బి సి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం,జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్,వన్ టౌన్ నాయకులు పజాల్, టౌన్ నాయకులు గణేష్, త్రినేశ్, యశ్వంత్, రఫీ, పండు పతదితరులు పాల్గొన్నారు..

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ పక్కాగా ఉండాలి

**అక్షర రేఖ న్యూస్, ఏప్రిల్ 09, సిద్దిపేట ప్రతినిధి :** కమిషనర్ అశ్రిత్ కుమార్ గారు పురపాలక సంఘం నందు ఏర్పాటు చేసినటువంటి రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల స్వీకరణ మరియు సమాచార కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కోసం రూ. 50,000 నుండి గరిష్టంగా 4 లక్షల వరకు రాయితీతో కూడిన రుణాలను యువతకి అందించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం తీసుకురావటం జరిగిందని ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చివరి అవకాశం ఉందని కావునా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు సరైన పత్రాలను పురపాలక సంఘంలో ఏర్పాటు చేసినటువంటి రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల స్వీకరణ మరియు సమాచార కేంద్రంలో అందజేయాలని మరి ఏవైనా సందేహాలు, సమాచారం అవసరం ఉన్నట్లయితే ఇట్టి రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల స్వీకరణ మరియు సమాచార కేంద్రంలో సంప్రదించాలన్నారు. అందులో భాగంగా పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల స్వీకరణ మరియు సమాచార కేంద్రాన్ని పరిశీలించి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ పక్కాగా ఉండాలని అధికారులు సూచించారు. వారి వెంట సాయి కృష్ణ, రమ్య,జ్యోతిలు తదితరులు ఉన్నారు.

## వంట గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి

### సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్

**అక్షర రేఖ న్యూసు , ఏప్రిల్ 09 సిద్దిపేట ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ బండపై రూ. 50ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తాడూరు రవీందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర రూ 50కి పెంచడం మూలంగా గ్యాస్ ధర 876 నుండి 905 పెరగడం మూలంగా పేద, మధ్యతరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలం నుండి పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరను ఇష్టానుసారం పెంచడం వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ములిగే నక్కపై తాటి పండు పడ్డట్టు చందంగా ధరల మీద ధరల తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై గ్యాస్ బండ మోపటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దానికి అనుగుణంగా పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల్సిన మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంతవరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి అత్తిని శారద మండల కమిటీ సభ్యులు ఉల్లపల్లి సాయిలు తేలు ఇస్తారి నీల బిక్షపతి తాడూరు మల్లేశం నాయకులు సార్ల యాదయ్య ప్రశాంత్ బాబు తాడూరి భరత్ కుమార్ రాజు సున్నం యాదగిరి కానుగుల రాజు మేకల కృపాకర్ శ్రవణాచారి అరుట్ల దయానంద్ కర్రోళ్ల లెనిన్ రాజు దయ్యాల అనిల్ అనిల్ పాల్గొన్నారు.

## శ్రీ గురులోక్ మాసంధ్ ప్రభు బ్రహ్మోత్సవాలకు

# అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట్, ప్రతినిధి, ఏప్రిల్ 9 (అక్షర రేఖ న్యూస్) :** నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లి లో ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగే శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) బ్రహ్మోత్సవాలకు అధికారులు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ కు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్ ను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు జాతర ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా వి.ఐ.పి మేనేజ్ మెంట్ జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. దేవాదాయ శాఖ పరంగా ఏం ఏర్పాట్లు చేశారని అడిగారు. ఆలయానికి, రథానికి కలర్స్ వేయిస్తున్నామని, మిగతా జాతర ఏర్పాట్లు చేస్తున్నామని ఈ.వో తెలిపారు. జాతర కోసం తమ శాఖ నుంచి మొత్తం 15 మంది ఉద్యోగులు సిబ్బందిని డిప్యూట్ చేయగా ప్రస్తుతానికి ఇద్దరు వచ్చి విధుల్లో చేరారని, మిగతా 13 మంది రెండు రోజుల్లో వస్తారని ఈ.వో తెలిపారు. గతేడాది మాదిరిగానే ఈ సారి ఆలయంలో 8 సీసీ కెమెరాలు అమర్చుతామని ఈ. వో తెలపగా, పోలీసు శాఖ కోరినట్లు మొత్తం 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ పరంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కల్పించామని, అలాగే 8 బ్లాకుల్లో రెండింటి లో స్లాబ్ వేయించామని, టైల్స్, ఆన్ ఆఫ్ ట్యాప్ క్లిప్పు లను ఫిట్ చేయాల్సి ఉందని మిషన్ భగీరథ ఈఈ రంగారావు తెలిపారు. రెండు పవర్ బోర్లకు మోటార్లు బిగించాల్సి ఉందన్నారు. శానిటేషన్ పరంగా దాదాపు 300 మంది కార్మికులతో పారిశుద్ధ్య సేవలు చేస్తామని, మూడు. సిఫ్టులలో వంద మంది చొప్పున కార్మికుల సేవలు అందుబాటులో ఉంటాయని డీఎల్పీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. జాతర నాలుగు రోజులు తిమ్మారెడ్డిపల్లిలో సెల్ ఫోన్లు కలవవు అని, తమకు వాకీ టాకీ లు ఇవ్వాలని డీఎల్పీవో సుధాకర్ జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ను కోరారు. జాతరలో ఒక డాక్టర్, సూపర్ వైజర్ , ఏ ఎన్ ఎం, ఆశాలతో మూడు సిఫ్టులలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఇంచార్జీ డీఎంఅండ్‌హెచ్ఓ శైలజ తెలిపారు. జాతరలో బారీ కేడ్లు ఏర్పాటు చేస్తామని పిఆర్ అధికారి విలోక్ చెప్పారు. అగ్నిమాపక శాఖ పరంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఫైర్ అధికారి చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల కోసం కోస్గి డిపో నుంచి 8 బస్సులు నడిపిస్తామని, మహబూబ్ నగర్ డిపో నుంచి అదనంగా మరికొన్ని బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డి ఎం లావణ్య తెలిపారు. జాతరలో భక్తుల కోసం దుస్తులు మార్చుకునే షెడ్లను ఏర్పాటు చేయడంతో మొబైల్ టాయిలెట్ ను అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యుత్ శాఖ పరంగా అవసరమైన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు, విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగనట్లు మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ ను ఉంచుతామని విద్యుత్తు శాఖ అధికారి తెలిపారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా జాతరలో దొంగతనాలు, ఈవ్ టీజింగ్ జరగకుండా మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్ నాయక్, డిఏస్పి నల్లపు లింగయ్య, సీ ఐ సైదులు, తహాసిల్దార్ జయరాములు, ఎంపీడీఓ కృష్ణా రావు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ఏప్రిల్ 9 అక్షర రేఖ ప్రతినిధి :** మెరుగైన సేవలతో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వసతులు, వైద్య కళాశాల లో సౌకర్యాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సౌకర్యాల మెరుగుపర్చుటకు చర్యలు చేపట్టాలన్నారు. టాయిలెట్ల మరమ్మత్తులు, అవసరమైన క్రొత్త తాయిలెట్ల నిర్మాణంనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. విభాగాల వారిగా కావాల్సిన సౌకర్యాల నివేదిక ఇవ్వాలన్నారు. ఓపి గదులు చిన్నవిగా ఉండడం వల్ల ఇబ్బందిగా ఉన్నట్లు, సరిపోవు విధంగా ప్రత్యామ్నాయ గదులు చూడాలన్నారు. మరో అంతస్తు, లిఫ్ట్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రేడియాలజిస్ట్ తదితర కావాల్సిన సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పై నియామకానికి చర్యలు తీసుకోవాలని, కావాల్సిన పరికరాలు, టెస్టింగ్ కిట్స్, మందుల జాబితా సమర్పించాలన్నారు. ఎలక్ట్రిషియన్, ప్లంబర్ లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల వసతులు, మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ వార్డ్ ను అభివృద్ధి చేయాలన్నారు. ఆరోగ్యం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కని, ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించే బాధ్యత మనపై ఉందని కలెక్టర్ అన్నారు. ప్రతి విభాగాధిపతిని వారి వారి విభాగంలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సౌకర్యాల విషయమై వెంటనే చర్యలు చేపట్టనున్నట్లు అన్నారు. వైద్యాధికారులు సేవాదృక్పథంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సైదులు, వైద్యాధికారులు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ షఫీయుల్లా, అధికారులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం

**నారాయణ్ పేట్, ప్రతినిధి, (అక్ష రేఖ న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో బుధవారం రోజు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దమ్గాన్ పూర్ సింగిల్ విండో చైర్మన్ గుల్ల నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడు వడ్లకు 2320 బి గ్రేడ్ వడ్లకు 2300 ధరా కేటాయించడం జరిగిందని రైతులకు ఈ సందర్భంగా తెలియజేశారు. ఉమ్మడి మద్దూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సింగిల్ విండో చైర్మన్ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో కోస్గి వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, సింగిల్ విండో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం స్కూల్లో స్వపరిపాలన దినోత్సవం

**నారాయణపేట, ప్రతినిధి, (అక్షర రేఖ న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో బుధవారం రోజు ఉర్దూ మీడియం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యా బోధన అందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తోటి విద్యార్థులతో ఆనంద ఉత్సవాల మధ్యన చిన్నారి విద్యార్థి విద్యార్థులు ఆనందంగా గడిపారు. డి ఈ ఓ గా ఫర్వాన్, ఎం ఈ ఓ గా ఎండి సైపోద్దిన్, హెడ్మాస్టర్ గా పబిహా బేగం, తదితరులు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన దించారు ఈ కార్యక్రమంలో ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు , మాజీ విద్యా కమిటీ చైర్మన్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు

## జై బాపు -జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం

### నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత సహాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం ఏప్రిల్ 9 అక్షర రేఖ ప్రాతినిధి :** భారతదేశపు స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ గారు చూపిన అహింసా మార్గం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి రాజ్యాంగ నిర్మాణంలో చేసిన విశేష కృషి మరియు మన రాజ్యాంగం అందించిన సమానత్వం న్యాయం వంటి విలువలను గౌరవించేందుకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అనే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందని గౌరవ దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహాత్మా గాంధీ గారి శాంతి సందేశం, అంబేద్కర్ గారి సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం మరియు మన రాజ్యాంగంలోని విలువలను ప్రజలకు చేరవేయడం కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్యంగా భావించాలన్నారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం దేశవ్యాప్తంగా పాదయాత్రలు, గ్రామ స్థాయి బ్లాక్ స్థాయి జిల్లాస్థాయి రాష్ట్రస్థాయిలో ర్యాలీల ద్వారా కొనసాగించి ప్రజలకు అవగాహన కల్పించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కొన్ని శక్తులు మన రాజ్యాంగాన్ని స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నాయని అలాంటి పరిస్థితుల్లో మనందరం ఐక్యంగా నిలిచి ఈ ఉద్యమంలో పాలుపంచుకొని రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. జై బాపు జై భీమ్ జై సమ్ విధాన్ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మన రాజ్యాంగాన్ని మన విలువలను రక్షించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరముందని, ఈ సందర్భంగా తెలియజేసి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంబంధిత సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కూసుమంచి క్యాంప్ కార్యాలయం నుండి కూసుమంచి మండల కేంద్ర కుడలిలో గల డాక్టర్ బి. ఆర్ అంబెద్కర్ గారి, మరియు దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాలకు పులామాల వేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, ఓబిసి చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్టే గురవయ్య, టీపీసీసీ స్పోక్స్ పర్సన్ కొరివి వెంకటరత్నం, మొహమ్మద్ హఫీజ్ ఉద్దీన్,భూక్యా.సురేష్ నాయక్,జొన్నలగడ్డ రవికుమార్, మాదాసు ఉపేంద్ర రావు, కంచర్ల జీవన్ రెడ్డి, బెల్లంకొండ శరత్, వడిత్య సెట్రం నాయక్, కేశవ రెడ్డి, బారి వీరభద్రం, వడిత్య కుమార్, గుండా భూపాల్ రెడ్డి, బండారుపల్లి శ్రీనివాసరావు, పేంద్ర అంజయ్య, రమేష్ రెడ్డి, నాయకులు, పత్రిక మిత్రులు, యూత్ విభాగం పాల్గొన్నారు.

## కొమురవెల్లి గ్రామ గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షులుగా తాళ్లపల్లి రాజు గౌడ్

**అక్షర రేఖ న్యూస్,ఏప్రిల్ 09, సిద్దిపేట ప్రతినిధి :** కొమురవెల్లి గౌడ సంఘం నూతన కమిటీ బుధవారం రోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు బత్తిని యాదగిరి గౌడ్ దొడ్ల విష్ణుమూర్తి గౌడ్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రాజు గౌడ్ ఉపాధ్యక్షులు ముత్యం పరుశురాములు గౌడ్ ప్రధాన కార్యదర్శి శివలింగ రమేష్ గౌడ్ కోశాధికారి బత్తిని నర్సింలు గౌడ్ శివయ్య గౌడ్ కార్యదర్శులు కొయ్యడ నరేష్ గౌడ్ ,ముత్యం కరుణాకర్ గౌడ్, దొడ్ల చిన్నస్వామి గౌడ్, సలహాదారులు ముత్యం స్వామి గౌడ్ దొమ్మాట రమేష్ గౌడ్ గౌరవ సలహాదారులు బండకింది బాలకనయ్య గౌడ్ దొడ్ల వెంకట స్వామి గౌడ్ కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ 42 మందితో వేసుకున్న నూతన కమిటీని కృషి చేస్తూ సంఘం అభివృద్ధికి పాటుపడతామని గౌడ సోదరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు ఎన్నికలకు సహకరించిన కుల సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కొమురవెల్లి గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులు 41 మంది పాల్గొన్నారు

## కేజీబీవీ ఉపాధ్యాయుల స్పాట్ బకాయిలు చెల్లించాలి.

### పిఆర్‌టియు జగిత్యాల జిల్లా శాఖవిజ్ఞప్తి

**జగిత్యాల జిల్లా, ఏప్రిల్9 (అక్షరరేఖ న్యూస్) :** గత సంవత్సరం జగిత్యాల జిల్లాలో ఎస్సెస్సి జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన కేజీబీవీ ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని జగిత్యాల జిల్లా విద్యాధికారి రాముకు పిఆర్‌టియు టిఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాల్ల అమర్ నాథ్ రెడ్డిలు విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా విద్యాదఖాధికారి రామును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ క్యాంప్ ఆఫీసర్ దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలున్నారు

## గర్భిణీలు, బాలింతలకు సూచనలు

**రాయికల్ మండలం, ఇటిక్యాల గ్రామం, ఏప్రిల్ 9 (అక్షరరేఖ న్యూస్) :** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని 5వ అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున సెక్టార్ సూపర్వైజర్ సువర్ణ ఆధ్వర్యంలో గర్భిణీలు బాలింతలు ఐదు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు పోషకాహారం గురించి మరియు ఐరన్ కాల్షియం మిల్లెట్స్ మరియు అనుబంధ ఆహారం మొదలగు పోషక ఆహారం గురించి వాటి విలువల గురించి తల్లులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.. గర్భిణి దశ నుండి 1000 రోజుల వరకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి మరియు ఆరోగ్యం గురించి ఆరోగ్య పరీక్షల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా ఈరోజు విహెచ్ఎండి కార్యక్రమంలో భాగంగా బాలామృతం టీచర్ పంపిణీ చేయడం జరిగింది.. మరియు గర్భిణీలు బాలింతలు తల్లుల చేత పోషకాహార ప్రతిజ్ఞ చేయించడం జరిగింది మరియు బాలింతల గృహ సందర్శనలు చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కుంట సుజాత, ఆశా కార్యకర్తలు సుమలత, రమాదేవి, అంగన్వాడీ ఆయా సాయమ్మ మరియు గర్భిణీలు బాలింతలు ఐదు సంవత్సరాల లోపు పిల్లల తల్లులు కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు..

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**మందమర్రి, ఏప్రిల్ 9 (అక్షర రేఖ న్యూస్) :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మందమర్రి ఏరియాలోని వృత్తి శిక్షణా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి ఏరియా జీఎం దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన కార్మికులతో పాటు, వివిధ గనుల విభాగాల నుండి వచ్చిన అనేక మంది శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరం మందమర్రి ఏరియాలో నిర్వహించిన 40వ రక్తదాన శిబిరంగా గుర్తింపు పొందింది. ఇప్పటివరకు ఈ ఏరియాలోని కార్మికులు కలిపి మొత్తం 2,856 యూనిట్ల రక్తాన్ని మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. రక్తదానంలో కార్మికులు చూపుతున్న చొరవ అభినందనీయమని జీఎం దేవేందర్ ప్రశంసించారు. తలసీమియా వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారికి సింగరేణి సంస్థ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉండాలని, రక్తదాన శిబిరాలను నిరంతరం నిర్వహిస్తామని దేవేందర్ తెలిపారు. రక్తదాన కార్యక్రమాల ద్వారా సమాజ సేవ చేసే అవకాశం అందరికీ కలగాలని ఆకాంక్షించారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ గుండేటి శంకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఓ. టు జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ట్రైనింగ్ అధికారి అశోక్ కుమార్, హెడ్ ఓవర్మెన్లు రాజేశం, రఘువరన్, గురుమూర్తి, డాక్టర్ రమేష్, రెడ్‌క్రాస్ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణం

**అక్షర రేఖ న్యూస్, ఏప్రిల్ 09, సిద్దిపేట ప్రతినిధి :** దుబ్బాక మండలంలోని రేకులకుంట మల్లికార్జున స్వామి కల్యాణాన్ని గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నిర్వహిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉడుత మల్లేష్ యాదవ్,కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్కంటి బుచ్చన్న,గొల్ల కుర్మ డోల్ దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ యాదవ్ తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ,రాష్ట్రంలో ఎక్కడైనా బ్రాహ్మణుల తోనే కళ్యాణం నిర్వహిస్తారని కానీ రేకులకుంట మల్లికార్జున స్వామి వద్ద మాత్రం మాత్రమే పసుపు బండారుతో కళ్యాణం నిర్వహిస్తారని తెలిపారు. శుక్రవారం తేదీని ఖరారు చేస్తామని తెలిపారు.

## ఎల్ఓసీల అందజేత

**అక్షర రేఖ న్యూస్ (ఏప్రిల్ 09నిజామాబాద్ ప్రతినిది) :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం షేట్పల్లి గ్రామానికి చెందిన బబ్బూరి నడిపి లింబన్న ఇటీవల యాక్సిడెంట్ కి గురై రెండు కాళ్ళు కోల్పోవడం జరిగింది.నిమ్స్ లో కృత్రిమ కాలు ఏర్పాటు సర్జరీ కోసం 1,00,000 రూపాయల మరియు ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన కల్లెడ దినేష్ అతి చిన్న వయసులో బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చేరడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స కొరకు 1 లక్ష 50 వేల రూపాయల ఎమ్మెల్యే వేముల మంజూరు చేయించారు....ఎల్ఓసి కాపీలను సంబంధిత ఇద్దరు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఈ రోజు వేల్పూర్ లో అందజేశారు. చికిత్స కొరకు లను ఎమ్మెల్యే మంజూరు చేయడంతో ప్రశాంత్ రెడ్డి మేలు మర్చి పోలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా తెలియజేసారు.

# రష్యా విక్టరీ డే పరేడ్

## ప్రధాని నరేంద్రమోదీకి ఆహ్వానం

**మాస్కో:** మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని భారత ప్రధాని నరేంద్ర మోదీకి రష్యా ఆహ్వానం పంపింది. ఈ మేరకు ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆంద్రీ రుడెంకో వెల్లడించారు. రెండో ప్రపంచయుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా 'విక్టరీ డే'(మే 9న)ని రష్యా నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఈ వేడుకలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్లు ఆంద్రీ రుడెంకో తెలిపారు. ఇప్పటికే ఆహ్వానం పంపినట్లు.. పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఓ రష్యన్ వార్తా సంస్థ కూడా వెల్లడించింది. ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తమ మిత్ర దేశాలకు ఆహ్వానాలు పంపింది. ఇక ప్రధాని మోదీ రష్యాలో గత ఏడాది జులైలో పర్యటించారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశ పర్యటన చేపట్టారు. 2019లో వ్లాడివోస్టాక్‌లో జరిగిన ఆర్థిక సదస్సుకు ఆయన హాజరయ్యారు. గత పర్యటన సందర్భంగా భారత్‌లో పర్యటించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను మోదీ ఆహ్వానించారు. మోదీ ఆహ్వానాన్ని పుతిన్ అంగీకరించినప్పటికీ.. పర్యటన తేదీలు ఇంకా ఖరారు కాలేదు. ఇక పుతిన్, మోదీలు తరచూ ఫోన్‌లో వివిధ అంశాలపై సంభాషించుకుంటారన్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ వేదికలపై కూడా ఇరువురు నేతలు సమావేశమవుతారు.

# మరోసారి విరుచుకుపడిన ఉక్రెయిన్..

## రాత్రికి రాత్రే 158 డ్రోన్లు కూల్చామన్న రష్యా

**రష్యా :** రష్యాపై డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ మరోసారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రే పెద్దసంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. ఈ కారణంగా బుధవారం తెల్లవారుజామున రష్యా దక్షిణ ప్రాంతంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. ముందుజాగ్రత్త చర్యగా రోస్తోవ్ ప్రాంతంలో డజన్ల కొద్దీ అపార్ట్‌మెంట్లలోని వారిని ఖాళీ చేయించాల్సి వచ్చిందని వివరించారు. ఈ ఘటనపై రష్యా రక్షణ మంత్రిత్వశాఖ టెలిగ్రామ్‌లో స్పందించింది. రాత్రికి రాత్రే 158 ఉక్రెయిన్ డ్రోన్లను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చివేశాయని ప్రకటించింది. ఇందులో రోస్తోవ్ ప్రాంతంలోకి చొచ్చుకొచ్చిన 29 డ్రోన్లు కూడా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ దాడి ఘటనలో ఎవరైనా గాయపడ్డారా అనే విషయం తెలియరాలేదు. అయితే.. రోస్తోవ్ ప్రాంతంలో 48 అపార్ట్‌మెంట్ వాసులను ఖాళీ చేయించామని ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు. 158 డ్రోన్లను కూల్చినట్లు రష్యా అధికారులు వెల్లడించినప్పటికీ.. అసలు ఉక్రెయిన్ ఎన్నింటిని ప్రయోగించిందన్న విషయంపై మాత్రం సమాచారం లేదు. కూల్చివేసిన డ్రోన్లలో రష్యాలోని క్రాస్నోడర్ ప్రాంతంలో 69.. ఉత్తర ఒస్సేటియా ప్రాంతంలో 15 డ్రోన్లు ఉన్నట్లు తెలిపింది. అయితే.. ఈ దాడులపై ఉక్రెయిన్ నుంచి వెంటనే ఎలాంటి స్పందన రాలేదు. యుద్ధంలో ఇరువైపులా కీలక మౌలిక సదుపాయాల విధ్వంసమే లక్ష్యంగా ఇలాంటి దాడులు జరుగుతున్నాయి. మరోవైపు రష్యా తరఫున యుద్ధంలో చైనీయులు పాల్గొంటున్నట్లు ఉక్రెయిన్ ఆరోపించింది. కీవ్‌తో మాస్కో చేస్తున్న పోరాటంలో చైనా పౌరులు పాల్గొన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపణలు చేశారు. తమ బలగాలు ఇద్దరు చైనీయులను అదుపులోకి తీసుకున్నాయని ఓ వీడియోలో ఆయన పేర్కొన్నారు. రష్యా సైన్యంతో కలిసి పోరాడుతున్న ఇద్దరు చైనీయులను డోనెట్స్క్ ప్రాంతంలో తమ దళాలు బంధించాయని తెలిపారు. వారి వ్యక్తిగత డేటా, బ్యాంకు కార్డులతో సహా ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

# అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించిన కెనడా

**కెనడా :** అమెరికా వాహనాలపై కెనడా 25శాతం సుంకాలను విధించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని మార్క్ కార్ని ట్విటర్‌లో ప్రకటించారు. వాషింగ్టన్ విధించిన సుంకాలకు ప్రతిగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించారు. కెనడా-యునైటెడ్‌స్టేట్స్-మెక్సికో ఒప్పందం పరిధిలోకి రాని వాహనాలన్నింటిపై ఈ నిర్ణయం వర్తిస్తుందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య విధానాలకు ప్రతిగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు కార్నీ పేర్కొన్నారు. "ట్రంప్ ఈ వాణిజ్య సంక్షోభానికి కారకులు. కెనడా కేవలం ఓ లక్ష్యం కోసం శక్తిమంతంగా స్పందించింది" అని వెల్లడించారు. కెనడా ఆర్థిక మంత్రి ఫ్రాంకోయిస్ ఫిలిప్ మాట్లాడుతూ "అకారణంగా అమెరికా విధించిన సుంకాలపై కెనడా శక్తిమేరకు స్పందిస్తూనే ఉంటుంది. ఈ సుంకాలను తొలగింపజేసి.. కెనడా ఉద్యోగులు, వాణిజ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను, పరిశ్రమలను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా-కెనడా మధ్య ఉద్రిక్తతలు గణనీయంగా పెరిగాయి. దీనికితోడు టారిఫ్‌ల విధింపుతో ఇవి తారస్థాయికి చేరాయి. మార్చి 4వ తేదీన కెనడా వస్తువుల దిగుమతిపై ట్రంప్ 25శాతం, ఇంధనం, పొటాష్‌పై 10శాతం టారిఫ్ విధించారు. ఆ తర్వాత సీయూఎస్ఎంఏ పరిధిలోకి రాని వాటికి మాత్రమే దీనిని పరిమితం చేశారు. ఆ తర్వాత మార్చి 12న కెనడా నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై 25శాతం సుంకం విధించారు. ఏప్రిల్ 3వ తేదీన కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలపై, మే 3 నుంచి విడిభాగాలపై 25శాతం చొప్పున పన్ను వేశారు. కెనడా కూడా వీటిని తగినట్లు స్పందిస్తూ అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు విధించింది.

### చాలా దేశాలు ఒప్పందాల కోసం తహతహ : ట్రంప్

అమెరికా సుంకాల దెబ్బకు చాలా దేశాలు ఒప్పందం కోసం తహతహలాడుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. రిపబ్లికన్స్ కాంగ్రెషనల్ కమిటీ డిన్నర్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్లీజ్ సార్.. ఓ డీల్ చేసుకొందాం" అంటూ తనని అడుగుతున్నారని చెప్పారు. ఏ దేశాల ప్రతినిధులు తనకు కాల్ చేశారో మాత్రం వెల్లడించలేదు. వాణిజ్య ఒప్పందాల కోసం వియత్నాం, ఇజ్రాయెల్, దక్షిణకొరియా దేశాధినేతలు ఫోన్లు చేసినట్లు తెలుస్తోంది.

# ఎక్కడో పొరపాటు జరిగింది..

## యూఎస్ ఎయిడ్ పునరుద్ధరిస్తున్నాం : అమెరికా

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అనూహ్య నిర్ణయాలు తీసుకుంటున్నారు. వృథా ఖర్చులను తగ్గించుకోవడం కోసమంటూ యూఎస్ ఎయిడ్‌ను నిలిపివేసి, మళ్లీ ఇప్పుడు దానిని పునరుద్ధరిస్తున్నారు. ఇటీవల 14 దేశాలకు ఆహార సహాయాన్ని నిలిపివేసిన అగ్రరాజ్యం.. పొరపాటున అలా జరిగిందని పేర్కొంది. ప్రపంచ ఆహార కార్యక్రమానికి సంబంధించిన మానవతా సహాయ ఒప్పందాలను పునరుద్ధరించిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఏఏ దేశాల్లోకి వెళ్తున్న సహాయం విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నారో తెలియాల్సి ఉంది. అంతర్యుద్ధాలతో అట్టుడికే దేశాల్లోని లక్షల మందికి ఐక్యరాజ్య సమితి 'ప్రపంచ ఆహార పథకం (డబ్ల్యూఎఫ్‌పీ)' ద్వారా అందించే సాయాన్ని అమెరికా ఇటీవల నిలిపివేసింది. అమెరికా నిర్ణయంపై ప్రపంచంలో అతిపెద్ద ఆహార సహాయ పథకాన్ని నిర్వహించే డబ్ల్యూఎఫ్‌పీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "ఇది లక్షల మందికి మరణ శాసనం అవుతుంది. వారంతా తీవ్ర ఆకలితో అలమటించిపోతారు. ఆకలి చావులు సంభవిస్తాయి" అని తన ఎక్స్ పేజీలో పేర్కొంది. ఈ నిర్ణయాన్ని ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ప్రాణాలను కాపాడే పథకాలకు సాయంపై ట్రంప్ యంత్రాంగంతోనూ సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొంది. ఇప్పటివరకు చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపింది. కోతల నుంచి ఆహారంతోపాటు ప్రాణాధార అత్యవసర సాయాలను మినహాయిస్తామని గతంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతోపాటు ప్రభుత్వ అధికారులు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో అగ్రరాజ్యం తన సహాయాన్ని పునరుద్ధరించింది. దాదాపు 120 దేశాలకు మానవతా దృక్పథంతో సహాయం చేయడానికి, ఆ దేశాల అభివృద్ధికి, భద్రతకూ నిధులు సమకూర్చడానికి అమెరికా యూఎస్ ఎయిడ్‌ను నెలకొల్పింది. ఈ సంస్థ ప్రపంచ దేశాలకు వందల కోట్ల డాలర్లను సహాయంగా అందిస్తోంది. కాగా అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం చేసే వృథా ఖర్చులను తగ్గించడానికి ఎలాన్ మస్క్ నేతృత్వంలో డోజ్ సంస్థను రూపొందించారు. యూఎస్ ఎయిడ్ ద్వారా వృథా ఖర్చులు ఎక్కువవుతున్నాయని, అది నేరగాళ్ల సంస్థ అని మస్క్ ఆరోపించడంతో.. ఆయన సూచనల మేరకు తొలుత కొంత కాలంపాటు యూఎస్ఎయిడ్ సేవలను నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అనంతరం ఆ సంస్థలోని వేల మంది ఉద్యోగులను తొలగించారు. దీంతో ఇన్నాళ్లు యూఎస్ ఎయిడ్‌పై ఆధారపడిన దేశాలపై తీవ్ర ప్రభావం పడింది.

## రఫేల్ మెరైన్ ఫైటర్ల డీల్‌కు సై..

### అంగీకరించిన భారత్

**న్యూఢిల్లీ :** భారత నౌకాదళానికి అత్యాధునిక ఫైటర్ జెట్లను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ మెరైన్ ఫైటర్ విమానాల కొనుగోలు డీల్‌కు భారత్ అంగీకరించింది. ఈమేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వార్త సంస్థ పేర్కొంది. ఈ డీల్ మొత్తం విలువ రూ.63,000 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీనిపై అతి త్వరలోనే సంతకాలు చేసే అవకాశాలున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం 22 సింగిల్ సీటర్ విమానాలు, శిక్షణ కోసం నాలుగు ట్విటన్ సీటర్ విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు కూడా దీనిలో ఉండనున్నాయి. ఆఫ్‌సెట్ నిబంధన కింద దేశీయంగా కొన్ని విడిభాగాలు తయారుచేయాలనే షరతు కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ డీల్‌కు ఆమోదముద్ర వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన విమాన వాహక నౌకపై ఈ రఫేల్ మెరైన్‌లను మోహరించాలని భారత్ భావిస్తోంది. ఇది సముద్ర జలాల్లో మన దేశ నౌకాదళ శక్తిని గణనీయంగా పెంచనుంది. రఫేల్‌లో మెరైన్ శ్రేణి విమానాలను నౌకాదళాల అవసరాలను దృష్టిలోఉంచుకొని అభివృద్ధి చేశారు. దీని ల్యాండింగ్ గేర్ భిన్నంగా ఉండటంతోపాటు.. అరెస్టర్ హుక్స్, చిన్న రన్‌వేపై టేకాఫ్ అయ్యేలా ప్రత్యేకమైన ఎయిర్ ఫ్రేమ్ వంటి వాటిల్లో వాడారు. ఇప్పటికే ఇది పలు పోరాటాల్లో తన శక్తిని చాటుకొంది. దీనిలో అత్యాధునిక ఏవియానిక్స్, ఆయుధాలు వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ విమానం ఒప్పందం కుదిరిన నాటినుంచి నాలుగేళ్లకు మన నౌకాదళానికి అందటం మొదలుకానున్నాయి. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని.. 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి. ఈ విమానాలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌పై వినియోగించనున్నారు. ఇప్పటికే ఉన్న మిగ్ 29కే విమానాల స్థానాలను ఇవి భర్తీ చేయనున్నాయి. భారత్-ఫ్రాన్స్ ప్రభుత్వాలు ఈ డీల్‌పై సంతకాలు చేయనున్నాయి. డసాల్ట్ నుంచి డెలివరీ డెడ్‌లైన్లు, నిర్వహణ ఇతర అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రెంచి ప్రభుత్వమే చూస్తుంది.

## ఘనంగా సీతారాముల రథోత్సవం

**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ :** మండలంలోని వర్కట్ పల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన రథోత్సవం మధ్యాహ్నం 2గంటలకు ముగిసింది. అంతకుముందు పూలతో అలంకరించిన రథానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించి, సీతారాములను పల్లకిలో కూర్చోబెట్టి ప్రత్యేక హారతులు ఇచ్చి రథాన్ని భక్తి భావంతో శ్రీరామ నామస్మరణం చేస్తూ ఉత్సాహంగా రథన్ని లాగారు.అనంతరం గ్రామంలోని పురవీధుల గుండా డప్పు చప్పుళ్ళు, సన్నాయి వాయిద్యాలు, కోలాట బృందాలతో రథన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంధమల్ల ముత్యాలు, మాజీ సర్పంచ్ మీసాల శేఖర్, గౌరవ అధ్యక్షులు నాగేల్లి బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు మీసాల యాదయ్య, అనంత చారి, మాజీ సర్పంచ్ నాగేలి స్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు లోడే వెంకటేష్, గూడూరు రాంరెడ్డి, మీసాల రాజు, మీసాల నరేష్, గంధమల్ల సుధీర్, గుండు స్వామి, అవిశెట్టి లింగస్వామి, గంధమల్ల దానయ్య, కల్లెం బుచ్చిరెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, గంధమల్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమత్స్యగిరి ఆలయంలోని అన్న ప్రసాద వితరణకు 25వేల విరాళం

**వలిగొండ:** మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రతి రోజు కొనసాగుతున్న అన్న ప్రసాద వితరణ కేంద్రానికి మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన రేఖల అంజయ్య గౌడ్ బుధవారం పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 25వేల రూపాయల విరాళం అందజేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి సల్వాద్రి మోహన్ బాబు తెలిపారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**వలిగొండ :** మండలంలోని మొగిలిపాక గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నా తోటి చదువుకున్న విద్యార్థులకు పాఠాలు చెప్పడం సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా టీచర్స్ అవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మూర్తి, అంగన్వాడి టీచర్ ప్రేమలత, ఆయా సంతోష, మంజుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజస్థాన్ చిత్తు..

## గుజరాత్ టైటాన్స్‌కు వరుసగా నాలుగో విజయం

**అహ్మదాబాద్:** ఐపీఎల్ 18లో గుజరాత్ టైటాన్స్ వరుసగా నాలుగో విజయం సాధించింది. హ్యాట్రిక్‌పై కన్నేసిన రాజస్థాన్ రాయల్స్‌ను ఆ జట్టు 58 పరుగుల తేడాతో చిత్తుచేసింది. సాయి సుదర్శన్ (82, 53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన రాజస్థాన్ 19.2 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. హెట్‌మయర్ (52, 32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకం చేశాడు. సంజు శాంసన్ (41, 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), రియాన్ పరాగ్ (26: 14 బంతుల్లో ఒక ఫోర్, 3 సిక్స్‌లు) పరుగులు చేశారు. యశస్వి జైస్వాల్(6), నితీశ్ రాణా(1), ధ్రువ్ జురెల్(5), శుభమ్ దూబె(1) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 3, రషీద్ ఖాన్ 2, సాయి కిశోర్ 2, సిరాజ్, అర్షద్ ఖాన్, కుల్వంత్ ఖేజ్రోలియా ఒక్కో వికెట్ తీశారు.

### అదరగొట్టిన సాయి సుదర్శన్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు ఆరంభంలోనే జోఫ్రా ఆర్చర్ షాకిచ్చాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో తొలి బంతికి శుభ్‌మన్ గిల్ (2)ని వెనక్కి పంపాడు. 147.7 కి.మీ. వేగంతో వచ్చిన బంతిని ఆడే క్రమంలో గిల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. మరో ఎండ్‌లో సాయి సుదర్శన్ మాత్రం దూకుడుగా ఆడాడు. తుషార్ దేశ్‌పాండే బౌలింగ్‌లో రెండు ఫోర్లు, ఓ సిక్స్ బాదాడు. జోస్ బట్లర్ (36, 25 బంతుల్లో 5 ఫోర్లు)కూడా నిలకడగా బౌండరీలు రాబట్టడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. తీక్షణ వేసిన పదో ఓవర్‌లో సుదర్శన్ అర్ధ శతకం (32 బంతుల్లో) పూర్తి చేసుకోగా.. అదే ఓవర్‌లో చివరి బంతికి బట్లర్ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ క్రమంలో 10 ఓవర్లకు గుజరాత్ స్కోరు 94/2కు చేరింది. తర్వాత క్రీజులోకి వచ్చిన షారుక్ ఖాన్ (36, 20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఫారూఖీ బౌలింగ్‌లో రెండు ఫోర్లు బాదిన అతను.. తీక్షణ వేసిన 14 ఓవర్ లో వరుసగా 6, 4, 4 బాదేశాడు. చివరకు తీక్షణ బౌలింగ్‌లో నే షారుక్ స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. కాసేపటికే రూథర్‌ఫోర్డ్ (7)ని సందీప్ శర్మ ఔట్ చేశాడు. అదే ఓవర్‌లో సుదర్శన్ వరుసగా సిక్స్, ఫోర్ రాబట్టాడు. సెంచరీపై కన్నేసిన సుదర్శన్ ను తుషార్ దేశ్‌పాండే 19వ ఓవర్‌లో వెనక్కి పంపాడు. అదే ఓవర్‌లో చివరి బంతికి రషీద్ ఖాన్.. జైస్వాల్‌కు చిక్కాడు. రాహుల్ తెవాతియా (24, 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) చివర్లో దూకుడుగా ఆడాడు. సందీప్ వేసిన చివరి ఓవర్‌లో తెవాతియా రెండు ఫోర్లు, ఒక సిక్స్ బాదాడు. రాజస్థాన్ బౌలర్లలో మహీశ్ తీక్షణ 2, తుషార్ దేశ్‌పాండే 2, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## పరిస్థితికి తగ్గట్లుగా ఆడేందుకు ప్రయత్నిస్తా : విరాట్ కోహ్లీ

ఐపీఎల్ 2025 సీజన్‌ను విరాట్‌కోహ్లీ అద్భుతంగా ప్రారంభించాడు. నాలుగు మ్యాచుల్లో రెండు అర్ధశతకాలు నమోదు చేశాడు. ఇటీవల జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ రాణించాడు. ముఖ్యంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ బాదాడు. ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో కీలకమైన ఇన్నింగ్స్ ఆడి 84 పరుగులు చేశాడు. గురువారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ముందు కోహ్లీ మీడియాతో మాట్లాడాడు. జట్టు తనకు ఇచ్చిన పాత్రను ఎల్లప్పుడూ నిర్వర్తించడానికి ప్రయత్నిస్తానన్నాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రేయస్ అయ్యర్ రాణించాడు. నేను ఫామ్‌లో ఉంటే లీడ్ తీసుకునేందుకు ముందుకు వస్తాను. ఎవరి ఆటతీరునూ ప్రభావితం చేయాలనుకోను. ఇక్కడ ఇగోలకు తావు లేదు. పరిస్థితికి అనుగుణంగా ఆడటానికి నేను ప్రయత్నిస్తా' అని విరాట్ కోహ్లీ అన్నాడు. అలాగే ఐపీఎల్‌లో తన తొలినాళ్లనాటి సంగతులను నెమరు వేసుకున్నాడు. 'నేను మొదటిసారి ఐపీఎల్‌లో ఆడినప్పుడు ఆశ్చర్యానికి గురయ్యా. అంతకు ముందు జహీర్ ఖాన్, యువరాజ్ సింగ్‌ను తప్ప ఇంకెవరినీ కలవలేదు. కానీ ఐపీఎల్‌లో అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్ వంటి దిగ్గజాలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం అద్భుతంగా అనిపించింది. అదే సమయంలో నేను కాస్త ఒత్తిడికీ గురయ్యాను. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుటీమ్‌లో టాప్‌ఆర్డర్‌లో ఆడటానికి నాకు మొదటి మూడు సంవత్సరాలు అవకాశాలు రాలేదు. నేను ఎక్కువగా లోయర్ ఆర్డర్‌లోనే బ్యాటింగ్ చేసేవాణ్ని. మొదటి సీజన్‌లో నేను చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. కానీ 2009 సీజన్‌లో కాస్త మెరుగయ్యాను. 2010 నుంచి నా ప్రదర్శనలో స్థిరత్వం వచ్చింది. 2011 సీజన్ నుంచి టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేస్తున్నాను. అప్పటి నుంచే ఐపీఎల్‌లో నా నిజమైన ప్రయాణం ప్రారంభమైంది' అని కింగ్ కోహ్లీ గతాన్ని గుర్తు చేసుకున్నాడు.

## సీఎస్కేకు ధోనీ ఎప్పటికీ సమస్యగా మారడు : రాబిన్ ఉతప్ప

ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో ఓటమి ఎదురైంది. పంజాబ్ కింగ్స్‌పై చివరి వరకూ పోరాడినా ఫలితం సానుకూలంగా రాలేదు. గత మ్యాచ్ వరకూ లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఎంఎస్ ధోనీ ఈసారి మాత్రం ఐదో స్థానంలోనే క్రీజ్‌లోకి వచ్చాడు. 12 బంతుల్లోనే 27 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ ముందు వరకు ధోనీ జట్టుకు భారంగా మారాడనే వ్యాఖ్యలు వినిపించాయి. అయితే, సీఎస్కే జట్టుకు ధోనీ సమస్యే కాదని.. ప్రస్తుతం జట్టు మార్పు దశలో ఉందని మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప వ్యాఖ్యానించాడు. "ధోనీ ఆటతీరులో దూకుడు లేదనే వ్యాఖ్యలు సరికాదు. ఐపీఎల్‌లోనే కాకుండా బయట కూడా తన బాధ్యతలను వేరొకరికి ఇచ్చేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటాడు. రాబోయే కాలంలో సీఎస్కే నుంచి ఏమి ఆశిస్తున్నారనేది ధోనీకి తెలుసు. ఇప్పుడు చెన్నై సూపర్ కింగ్స్ మార్పు దశలో ఉంది. ఎంఎస్ ధోనీని చూసేందుకు అభిమానులు భారీగా స్టేడియాలకు వస్తున్నారు. ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌పై ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. తప్పకుండా ఈ సమస్యకు ముగింపు దక్కుతుందని ఆశిస్తున్నా. చెన్నై జట్టుకు తానొక సమస్యగా ధోనీ ఎప్పటికీ మారడు" అని రాబిన్ వెల్లడించాడు.

## ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించినా.. నష్టాల్లోనే సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వృద్ధికి ఊతం ఇచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో పాటు మరిన్ని కోతలు ఉంటాయని సంకేతాలు ఇచ్చినా సూచీల నష్టాలు కొనసాగాయి. అమెరికా సుంకాల వల్ల నెలకొన్న వాణిజ్య యుద్ధ భయాలు, తద్వారా వృద్ధి నెమ్మదిస్తుందన్న ఆందోళనల ముందు ఆర్‌బీఐ నిర్ణయాలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ఈ క్రమంలోనే అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలదీ అదే బాట. నిఫ్టీ ఐటీ, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ, హెల్త్‌కేర్ సూచీలు ప్రధానంగా నష్టాలు ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 74,103.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,227.08) వద్ద నష్టాల్లోనే ప్రారంభమయ్యాయి. ఆరంభంలో ఒడుదొడుకులు ఎదుర్కొంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరికి 379.93 పాయింట్ల నష్టంతో 73,847.15 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 136.70 పాయింట్ల నష్టంతో 22,399 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.69గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, సన్‌ఫార్మా షేర్లు నష్టాల్లో ముగిశాయి. నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, టైటాన్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్సు 3063 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## మా కార్లపై సుంకాలు తొలగించండి

### భారత్‌ను కోరిన ఐరోపా సమాఖ్య

తమ కూటమి దేశాల్లో ఉత్పత్తి అయిన కార్లపై సుంకాలను తొలగించాలని ఐరోపా సమాఖ్య భారత్‌ను కోరినట్లు సమాచారం. ఈయూతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనేందుకు వీలుగా ఈ విన్నపానికి మోదీ సర్కారు సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని కార్లపై 100శాతానికి పైగా టారిఫ్‌లు ఉన్నాయి.. వీటిని 10శాతానికి తీసుకొచ్చే అవకాశం ఉంది. కానీ, దేశీయ పరిశ్రమలు మాత్రం కనీసం 30శాతం పన్నులను కొనసాగించేలా లాబియింగ్ చేస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో దేశీయంగా విద్యుత్తు కార్ల సంస్థల ప్రయోజనాలను ప్రభుత్వం మరో నాలుగేళ్లపాటు రక్షించాలని కోరుతున్నారు. ఇక ప్రభుత్వం ఈయూ కోరినట్లు నిర్ణయం తీసుకొంటే.. ఫోక్స్‌వాగన్, బెంజ్, బీఎండబ్ల్యూ వంటి సంస్థలకు భారత మార్కెట్లోకి మరింతగా చొచ్చుకుపోయే అవకాశం లభించినట్లే. ఈ డిమాండ్‌పై స్పందించడానికి ఐరోపా కమిషన్ నిరాకరించింది. కానీ, చర్చల వివరాలు మాత్రం వెల్లడించింది. చాలా విభాగాల్లో భారత్–ఐరోపా సమాఖ్య భిన్నవైఖరులు అవలంభిస్తున్నాయని పేర్కొంది. ట్రంప్ సర్కారు వారం క్రితం ద్వైపాక్షిక చర్చల సందర్భంగా భారత్ వద్ద ఇటువంటి డిమాండ్‌నే ఉంచింది. ముఖ్యంగా ఈవీలపై కూడా దిగుమతి సుంకాలను తొలగించాలని పట్టుబట్టింది. భారత్ దీనికి సానుకూలంగా స్పందిస్తే.. టెస్లాకు భారీగా లబ్ధి చేకూరే అవకాశం ఉంది. దేశీయ కంపెనీలను రక్షించడానికి భారత్ అత్యంత కఠిన నియమాలను అమలు చేస్తోంది. దిగుమతులను ఏమాత్రం ప్రోత్సహించే అవకాశం లేదు. టాటా, మహీంద్రా వంటి కంపెనీలు ఈవీల దిగుమతులపై టారిఫ్‌లకు మద్దతు ఇస్తున్నాయి.

### లండన్‌లో భారత్-యూకే పెట్టుబడిదారుల సమావేశం..

లండన్‌లో భారత్–యూకే పెట్టుబడిదారుల రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతోంది. మన దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దీనికి అధ్యక్షత వహిస్తున్నారు. ఇందులో దాదాపు పెన్షన్ ఫండ్స్, బీమా, బ్యాంకింగ్ రంగాలకు చెందిన 60 మంది యూకే పెట్టుబడిదారులు పాల్గొన్నారు. నూతన భారత్ కోసం పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి కోసం ప్రభుత్వ ప్రాధాన్యాలను ఆమె వెల్లడించారు. "భారత ప్రభుత్వం బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు.. వాటికి బలమైన అభివృద్ధిని కూడా ఆఫర్ చేస్తోంది. ఏటా 7.1శాతం వృద్ధితో 2032 నాటికి భారత్ ఆరో అతిపెద్ద బీమా మార్కెట్‌గా అవతరించనుంది. జీ20 దేశాల్లో అత్యంత వేగంగా ఎదుగుతున్న బీమా మార్కెట్ ఇదే. 2023 నాటికి టీ1 సెటిల్మెంట్లను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న తొలి మార్కెట్ కూడా భారత్. ప్రస్తుతం దేశంలోని మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.6 ట్రిలియన్ డాలర్లు" అని పేర్కొన్నారు.

## చెన్నై సమీపంలో డిక్సన్ టెక్నాలజీస్ రూ.1000 కోట్ల పెట్టుబడి

ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల సంస్థ డిక్సన్ టెక్నాలజీస్..చెన్నై సమీపంలో రూ.1,000 కోట్లతో పర్సనల్ కంప్యూటర్స్, ల్యాప్‌టాప్‌లు తయారీకి సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ రోజు(బుధవారం) తమిళనాడు ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. పొరుగున ఉన్న కాంచీపురం జిల్లాలోని ఒరగడం వద్ద ఏర్పాటు చేయనున్న ఈ కర్మాగారం వల్ల ఈ ప్రాంతంలో 5,000 ఉద్యోగులకు ఉపాధి కలగనుందని అంచనా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఒప్పందం ప్రకారం, డిక్సన్ టెక్నాలజీస్ చెన్నైకు దక్షిణంగా 45 కి.మీ దూరంలో ఉన్న ఒరగడంలోని ఇండోస్పేస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో కంప్యూటర్స్‌కు సంబంధించిన ఉత్పత్తులను తయారు చేయనుంది. ఈ కర్మాగారం ల్యాప్‌టాప్‌లు, పర్సనల్ కంప్యూటర్ల ఉత్పత్తితో పాటు ఇతర కంపెనీలకు ఎలక్ట్రానిక్ తయారీ సేవలను కూడా అందిస్తుంది. ఈ రోజు సచివాలయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, పరిశ్రమల మంత్రి టి.ఆర్.బి. రాజా సమక్షంలో డిక్సన్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సునీల్ వాచానీ, వైస్ ప్రెసిడెంట్ పృథ్వీ వాచానీ నేతృత్వంలోని ఉన్నతాధికారులు తమిళనాడు నోడల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ గైడెన్స్ ఎండీ సీఇఓ డేరెజ్ అహ్మద్‌తో పత్రాలను మార్పిడి చేసుకున్నారు. 1993లో స్థాపించబడిన డిక్సన్ టెక్నాలజీస్..శామ్‌సంగ్, షియామి, మోటరోలా, పానాసోనిక్, టీసీఎల్ టెక్నాలజీస్, వన్‌ప్లస్ వంటి వివిధ కంపెనీలకు కాంట్రాక్ట్ తయారీ సేవలను అందిస్తోందని ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది.




## మర్చంట్ లావాదేవీల పరిమితి పెంచుకోవచ్చు..

### ఆర్‌బీఐ అనుమతి

**ముంబయి:** డిజిటల్ చెల్లింపులకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాపారులకు వ్యక్తులు చేసే పీ2ఎం చెల్లింపుల పరిమితిని యూజర్ల అవసరాలకు అనుగుణంగా పెంచుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఆర్‌బీఐ అనుమతి కల్పించింది. ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను కేంద్ర బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈ సందర్భంగా యూపీఐ చెల్లింపులపై తీసుకున్న నిర్ణయాన్ని ప్రకటించారు. "వినియోగాన్ని పెంచి యూపీఐ వ్యవస్థను మరింత సమర్థంగా మార్చేందుకు మేం ఈ ప్రతిపాదన చేస్తున్నాం. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతో చర్చించి.. యూజర్ల అవసరాలకు అనుగుణంగా పీ2ఎం లావాదేవీల పరిమితిని పెంచుకోవచ్చు" అని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. అయితే, ఈ పెంపు వల్ల పొంచి ఉన్న ముప్పుల నుంచి తగిన రక్షణ చర్యలు కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని మల్హోత్రా గుర్తు చేశారు. అంతేగాక, ఈ పరిమితులపై ఎన్‌పీసీఐ నిబంధనలకు లోబడి నిర్ణయం తీసుకునే హక్కు బ్యాంకులకు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం వ్యక్తుల నుంచి వ్యక్తులకు చేసే పర్సన్ టు పర్సన్, పర్సన్ టు మర్చెంట్ యూపీఐ లావాదేవీలపై రూ.లక్ష వరకు పరిమితి ఉంది. అయితే, కొన్ని ప్రత్యేక అవసరాల కోసం పీ2ఎం చెల్లింపులపై రూ.2లక్షలు, రూ.5లక్షల వరకు పరిమితి ఉంది. పీ2ఎం లావాదేవీలపై ఈ పరిమితిని పెంచుకోవచ్చని తాజాగా ఆర్‌బీఐ చెప్పింది. అయితే, పీ2పీ చెల్లింపుల పరిమితిలో ఎలాంటి మార్పు ఉండదు.

# ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో

## 22 నుంచి షూటింగ్‌లోకి జూనియర్ ఎన్టీఆర్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ర ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్టీఆర్ 31గా ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే తాజాగా ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు ఈ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నాడని అభిమానులు ఎదురుచూస్తుండగా.. వారికి గుడ్ న్యూస్ చెబుతూ.. ఈ నెల 22 నుంచి తారక్ ఈ మూవీ షూటింగ్‌లో పాల్గొంటారని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇక ఈ క్రేజీ అప్‌డేట్‌తో ఎన్‌టీఆర్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందించనున్నారు.

# అది నా జాతకంలోనే ఉంది

## పొలిటికల్ ఎంట్రీపై రేణూ దేశాయ్

రాజకీయాల్లోకి వెళ్లే అవకాశం గతంలోనే వచ్చిందని, పిల్లల కోసం వదులుకున్నానని నటి, దర్శకురాలు రేణూ దేశాయ్ తెలిపారు. ఓ పాడ్‌కాస్ట్‌లో తన పొలిటికల్ ఎంట్రీ గురించి మాట్లాడారు. "రాజకీయాల్లోకి వెళ్లడమనేది నా జాతకంలోనే ఉంది. గతంలో ఓ ఛాన్స్ వచ్చింది. కేవలం పిల్లల పెంపకం కోసమే ఆ అవకాశాన్ని వదులుకున్నా. ఇప్పటికీ అదే అభిప్రాయం. నేను విధిరాతకు వ్యతిరేకంగా ప్రయాణిస్తున్నా" అని పేర్కొన్నారు. పాలిటిక్స్ అంటే ఇష్టమేనా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. "సామాజిక సేవ చేయడంలోనే నాకు ఆనందం. ఏ చిన్నారీ ఆకలితో ఉండకూడదనుకుంటా. మన దేశంలో డబ్బు, ఆహారానికి లోటు లేదు. ఒకవేళ నేను ఏదైనా పొలిటికల్ పార్టీలో చేరితే తప్పకుండా చెబుతా. అది రహస్యంగా దాచేది కాదు కదా. నా స్నేహితులు, పిల్లలతో ఉన్నది ఉన్నట్టు చెప్పేస్తుంటా. పాలిటిక్స్‌లో నేను ఫిట్ కానని అనిపిస్తుంటుంది (నవ్వుతూ)" అని అన్నారు. తనయుడు అకీరాను రామ్‌చరణ్ పరిచయం చేయనున్నారనే ప్రచారంపై ఆమె స్పందిస్తూ.. "వాటిలో నిజం లేదు. 'ఓజీ' సినిమాకీ అకీరా పని చేయట్లేదు. అకీరా నటన గురించి ఆలోచించిన రోజే నా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెడతా. కొందరు యూట్యూబర్లు మనీ కోసం తప్పుడు థంబ్‌నైల్స్ పెడుతున్నారు" అని పేర్కొన్నారు.

## 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి': అలరిస్తున్న గీతం

నందమూరి కల్యాణ్‌రామ్, విజయశాంతి తల్లీకొడుకులుగా నటించిన సినిమా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. సయీ మంజ్రేకర్ హీరోయిన్. నూతన దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'ముచ్చటగా బంధాలే' సాంగ్ లిరికల్ వీడియో రిలీజ్ చేసింది.

## అజిత్ ఇచ్చిన ధైర్యమే ముందుకు నడిపించింది

సీనియర్ నటుడు అజిత్‌ను కలిసిన తర్వాత తన జీవితమే మారిపోయిందన్నారు దర్శకుడు అధిక్ రవిచంద్రన్. ఆయన తెరకెక్కించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అజిత్‌పై ప్రశంసలు కురిపించారు. 22 ఏళ్ల దర్శకుడిగా తొలి సినిమాను తెరకెక్కించాను. ఆ తర్వాత ఓ సినిమా (అన్బానవన్ అసరాధవన్) ఫ్లాప్ అయింది. ఆ సమయంలో అజిత్ తప్ప నాకెవ్వరూ ధైర్యం చెప్పలేదు. ఆయన ఇచ్చిన మద్దతు ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటినుంచి నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ప్రేక్షకులు ఎలాంటి సినిమాలను ఆదరిస్తారో అర్థమైంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెరకెక్కించే సమయంలో ఆయన గురించి మరింత తెలుసుకునే అవకాశం వచ్చింది. ఆయన చుట్టూ ఉండే వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తారో తెలుసుకున్నాను. ఆయన ఒక లెజెండ్. ఎవరినీ బాధపెట్టరు. ఎవరి గురించి చెడుగా మాట్లడరు. ఆయన కోసం ఎన్నో కాస్ట్యూమ్స్ తయారుచేశాం. వాటిని ఎంతో ఓపికగా ధరించారు' అని చెప్పారు. అజిత్‌కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కోసం సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన -టైలర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. అజిత్, త్రిషల మధ్య సంభాషణలు ఆకట్టు-కునేలా ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలోని 'గాడ్ బ్లస్ యూ' అంటూ సాగే రెండో పాటను చిత్రబృందం విడుదల చేసింది.

# లెనిన్‌గా వస్తోన్న అక్కినేని అఖిల్

అఖిల్ అక్కినేని హీరోగా, మురళీ కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెనిన్'. అక్కినేని నాగార్జున, సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నాగవంశీ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు తాజాగా 'లెనిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అఖిల్ పుట్టిన రోజును పురస్కరించుకుని లెనిన్ టైటిల్ గ్లింప్స్ ను విడుదల చేశారు. ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది కాదు.. అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ సినిమా గ్లింప్స్ చూస్తుంటే లవ్, యాక్షన్, రొమాన్స్, డివోషనల్ అంశాలతో తెరకెక్కించినట్టు- క్లియర్‌గా అర్థమవుతుది. ముఖ్యంగా తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ అదిరిందనే చెప్పాలి. ఇదిలా ఉండగా లెనిన్ టైటిల్ గ్లిమ్స్ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. యూట్యూబ్ లో టాప్ లో ట్రెండింగ్ అవుతోంది. ఈ విషయాన్ని మూవీ టీమ్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. అఖిల్ ను మునుపెన్నడు చూడని లుక్ లో కనిపించడం అటు ఫ్యాన్స్ తో పాటు- సినీ ప్రేక్షకుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇక శ్రీలీల ఈ మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. శ్రీ లీల ఈ సినిమాలో డిఫరెంట్‌గా రెండు జడలలో కనిపించింది. వరుస డిజాస్టర్స్ తర్వాత అటు అఖిల్ ఇటు శ్రీ లీల చేస్తున్న ఈ సినిమాతో సాలిడ్ హిట్ ఇస్తారని ఇరువురి ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.

# వరుస ఫెయిల్యూర్‌తో కావ్య థాపర్ సైలెంట్

గత ఏడాది బాగా హడావుడి చేసిన బ్యూటీ కావ్య థాపర్ ఈ ఏడాది సైలెంట్ అయ్యింది. ఫ్లాప్స్ ఆమె కెరీర్ పై గట్టి దెబ్బే వేశాయి. స్టార్ హీరోలతో జోడీ కట్టినప్పటికీ ఇప్పుడు ఛాన్సుల కోసం వెయిట్ చేస్తోంది. ఈ మాయ ప్రేమేమిటోతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన కావ్య బేబీ ఈ ఏడేళ్లలో పది సినిమాలు కూడా చేయలేకపోయింది. కోలీవుడ్, బాలీవుడ్‌లోకి స్టెప్ ఇన్ అయినా పెద్దగా కలిసి వచ్చిందీ ఏమీ లేదు. ఏక్ మిని కథ, పిచ్చెకారన్ చిత్రాల్లో మంచి ఫెర్ఫామెన్స్ చూపించడంతో టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించే ఛాన్సులు కొల్లగొట్టింది కావ్య. అప్పటి వరకు ఏడాదికి ఒక్క మూవీ చేసుకుంటూ వచ్చిన భామ లాస్ట్ ఇయర్ నాలుగు సినిమాలతో పలకరించింది. రవితేజ ఈగల్, సందీప్ కిషన్ ఊరు పేరు భైరవకోన, రామ్ డబుల్ ఇస్మార్ట్, గోపీచంద్ విశ్వమ్‌లో గ్లామరస్ రోల్‌లో కనిపించింది కానీ ఊరు పేరు భైరవ కోన మినహా మిగిలివన్నీ డిజాస్టర్లు. ఈ హ్యాట్రిక్ ఫ్లాప్స్ ఆమె కెరీర్‌పై గట్టి దెబ్బేశాయి. పేలవమైన స్క్రిప్ట్స్ కావ్యను ఫేడవుటుకు దగ్గర చేశాయి. విశ్వం తర్వాత కాస్త గ్యాప్ తీసుకునేందుకు వెకేషన్స్‌కు వెళ్లిన కావ్య థాపర్ మళ్లీ కెరియర్ పై ఫోకస్ చేస్తోంది. ఓ సినిమాకు కమిటైనట్లు టాక్. ధమాకా దర్శకుడు త్రినాథ రావు నక్కిన అప్ కమింగ్ ప్రాజెక్టులో ఓకే అయినట్లు- టీఎఫ్ఐలో బజ్ నడుస్తోంది. హవీష్ హీరోగా తెరకెక్కుతోన్న ఈసినిమా ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లినట్లు సమాచారం.

# అవును.. నేను ఒంటరినే : తమన్నా

అవును.. నేను ఒంటరినే అంటూ తమన్నా భాటియా సమాధానం ఇచ్చారు. తమన్నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. ఆమె కొన్నేళ్లుగా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వారిద్దరూ విడిపోయినట్లు కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయని, అందుకే బ్రేకప్ చెప్పేసుకున్నారని తెలుస్తోంది. అయితే, బ్రేకప్ వార్తలపై వీరిద్దరూ ఎక్కడా స్పందించలేదు. 'ఓదెల 2'ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా పాల్గొంటున్న నటి తమన్నా తాజాగా జరిగిన ట్రైలర్ విడుదల ప్రచార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. నటుడు విజయ్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ ఒక విలేకరి తమన్నాను ప్రశ్నించారు.దీనిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. విజయ్ అనే పేరు ఎక్కడా రాకుండా ఆమె బదులిచ్చారు. కార్యక్రమంలో తమన్నాతోపాటు- ఇతర చిత్రబృందం పాల్గొంది. ఇందులోభాగంగా ఓ విలేకరి.. మంత్రాలు, తంత్రాలు ఉపయోగించి మీరు ఎవరిమీదనైనా విజయం సాధించాలను కుంటున్నారా అని ప్రశ్నించింది. దీనిపై తమన్నా స్పందిస్తూ.. 'మంత్ర, తంత్రాలతో అలాంటిది జరుగుతుందంటే నేను నమ్మను. ఒకవేళ అదే నిజమైతే మీపై ప్రయోగిస్తా. అందరూ నా చేతుల్లో ఉంటారు. నేను చెప్పింది వింటారు. నేను ఏం చెబితే అదే రాసుకుంటారని ఆమె సరదాగా బదులిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. విజయ్ పేరు ప్రస్తావించ డానికి కూడా తమన్నా ఇష్టం చూపించడం లేదని మాట్లాడుకుంటున్నారు. అనంతరం ఆధ్యాత్మిక జీవనం గురించి తమన్నా మాట్లాడారు. 'జీవితంలో మనకు ఎలాంటి సమస్య ఎదురైనా దానినుంచి బయట పడేందుకు ఎదుటి వ్యక్తులపై ఆధారపడాలను కుంటాం. ఆవిధంగా వారి నుంచి మనం సపోర్ట్ పొందుతాం. కానీ, ఆధ్యాత్మిక ప్రయాణంలో నేను ఒక విషయాన్ని నేర్చుకున్నా. ఆనందం లేదా బాధ మన చేతుల్లోనే ఉండాలి. ప్రశ్న ఏదైనా లోతుగా ఆలోచిస్తే సమాధానం కూడా దొరుకుతుందని ఆమె చెప్పారు. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్'కు కొనసాగింపుగా 'ఓదెల 2' సిద్ధమైంది. ఇందులో తమన్నా శివశక్తిగా కనిపించనున్నారు. అశోక్ తేజ దర్శకుడు. ఏప్రిల్ 17న ఈ సినిమా విడుదల కానుంది.

Printed, Published & Owned by V. SAI KRISHNAREDDY, Printed at SAI KRISHNA PRINTERS, Door No. 7-7-86/1, Near Collector Chowk, Adilabad (T.S) 504001 Published at H.No. 1-2-125/1, Pithruchaya Nilayam, Shanti Nagar, Adilabad-504001 (T.S) Editor: V. SAI KRISHNA REDDY, RNINO. TELTEL/2012/44706, CELL:7073352171, Email: aksharareкhadaily@gmail.com